ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు ,
జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి
పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -58 పేజీలు - 8 వెల - 03/- బుధవారం 17 జూన్ 2026

# ఫ్రాన్స్‌లో జీ7 సదస్సు..

## మోదీ, ట్రంప్‌కరచాలనం

**హర్మూజ్ గుండా చమురు సరఫరా సులభతరమైందన్న ట్రంప్**

**రష్యా చమురుపై త్వరలో మళ్లీ ఆంక్షలు విధిస్తామని వెల్లడి**



**న్యూఢిల్లీ,జూన్ 16 రిపబ్లిక్ న్యూస్**
ఫ్రాన్స్‌లోని ఇవియాన్‌లో జరుగుతున్న జీ7 శిఖరాగ్ర సదస్సులో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. మంగళవారం నిర్వహించిన కీలకమైన 'ఔట్‌రీచ్ సెషన్'లో భాగంగా ఆయన ప్రపంచ నేతలతో కలిసి వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పరస్పరం కరచాలనం చేసుకుని, ప్రత్యేకంగా చర్చించుకోవడం విశేషం. **మిగతా 2లో...**

# టెలిగ్రామ్ యాప్‌పై కేంద్రం ఆంక్షలు

**నీట్ రీ ఎగ్జామ్‌తో అప్రమత్తం**




**న్యూఢిల్లీ,జూన్ 16 రిపబ్లిక్ న్యూస్**
నీట్ 2026 రీ-ఎగ్జామినేషన్ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పరీక్షను సురక్షితంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు టెలిగ్రామ్ యాప్ యాక్సెస్‌పై తాత్కాలిక ఆంక్షలు విధించినట్లు తెలుస్తోంది. ఐటీ చట్టం సెక్షన్ 69ం కింద ఈ చర్యలు తీసుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. జూన్ 22 వరకు భారతదేశంలో టెలిగ్రామ్ యాప్ **మిగతా 2లో...**

# జులై మూడో వారంలో తల్లికి వందనం..



**విద్యాశాఖ అధికారులతో మంత్రి లోకేశ్ సమీక్ష**

**ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచాలని మంత్రి లోకేష్ ఆదేశం**

**జూన్ 29న షైనింగ్ స్టార్స్, జులైలో మెగా పీటీఎం నిర్వహణకు నిర్ణయం**

**వివిధ 'సెట్'లను సకాలంలో నిర్వహించాలని ఉన్నత విద్యాశాఖకు సూచన**

**ఏపీకి ఎన్‌సీసీ స్టేట్ డైరెక్టరేట్ మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు**

**అమరావతి,జూన్ 16 రిపబ్లిక్ న్యూస్**
రాష్ట్ర విద్యావ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసి, విద్యార్థులకు నాణ్యమైన భవిష్యత్తును అందించే దిశగా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా, విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ విద్యాశాఖ అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న **మిగతా 2లో...**

# అద్భుత నగరంగా అమరావతి నిర్మాణం

**లీడర్‌షిప్ ప్లీనరీ-2లో చంద్రబాబు ప్రసంగం**



**అంతర్జాతీయ మౌలిక వసతులతో తీర్చిదిద్దుతున్నాం**

**పీపుల్ ఫస్ట్ మా విధానంలో నాలెడ్జ్ సిటీగా చేస్తున్నాం**

**సింగపూర్‌తో ఏపికి మంచి సంబంధాలు**

**మూడు దశాబ్దాలుగా కలసి పనిచేస్తున్నాం**

**పార్ట్‌నర్‌షిప్ సన్నాహక సమ్మిట్‌లో చంద్రబాబు**




**అమరావతి,జూన్ 16 రిపబ్లిక్ న్యూస్**
పీపుల్ ఫస్ట్ మా విధానమని... ఈక్విటీ, నేచర్, ఆపర్చునిటీ, లివబుల్ సిటీగా అమరావతి ఉంటుందని సీఎం చంద్రబాబు తెలిపారు. అంతర్జాతీయ మౌలిక వసతులతో, అవకాశాల వేదికగా అమరావతిని తీర్చిదిద్దుతున్నామన్నారు. సింగపూర్‌లో **మిగతా 2లో...**



# ఎపికి చేయూత

**వాజ్‌పేయ్ పార్కులో స్వచ్ఛభారత్‌లో కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి**

**విజయవాడ,జూన్ 16 రిపబ్లిక్ న్యూస్**
కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కట్టుబడి ఉందని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి స్పష్టం చేశారు. ఒక రోజు పర్యటనలో భాగంగా విజయవాడ చేరుకున్న ఆయన.. నగరంలోని వాజ్‌పేయీ పార్కులో స్వచ్ఛభారత్‌లో భాగంగా చీపురు పట్టి చెత్త ఊడ్చారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు **మిగతా 2లో...**

# క్లీన్ గోదావరిని ప్రక్షాళన చేయండి

**- స్వచ్ఛ గోదావరి పవిత్ర పుష్కరాల నిర్వహణకు సహకరించండి**

**- కేంద్ర జల్ శక్తి మంత్రి సి ఆర్ పాటిల్ ని కలసిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**

**-గోదావరి కాలుష్య నివారణ, సవాళ్లపై చర్చ**

**న్యూఢిల్లీ,జూన్ 16 రిపబ్లిక్ న్యూస్**



నమామి గంగే ప్రాజెక్టు తరహాలో క్లీన్ గోదావరి నది ప్రాజెక్టుని చేపట్టి గోదావరి నది ప్రాశస్త్యాన్ని కాపాడేలా కేంద్ర తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రివర్యులు, అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ కేంద్ర జల్ శక్తి మంత్రి సి.ఆర్. పాటిల్ ని కోరారు. వచ్చే ఏడాది జరగబోయే గోదావరి పుష్కరాలను స్వచ్ఛ గోదావరి పవిత్ర పుష్కరాలు థీమ్ తో చేపడుతున్నామని చెప్పారు. దీనికి అనుగుణంగా గోదావరిని స్వచ్ఛంగా మార్చేందుకు కేంద్రం అందించే సహకారం చాలా అవసరం అన్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా మంగళవారం మధ్యాహ్నం కేంద్ర జల్ శక్తి మంత్రివర్యులు శ్రీ సి.ఆర్ పాటిల్ గారితో శ్రీ పవన్ కళ్యాణ్ గారు సమావేశం అయ్యారు. అనంతరం మీడియాతో శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ "గోదావరి పుష్కరాలకు దేశం నలుమూలల **మిగతా 2లో...**

# మహిళా ప్రజాప్రతినిధిపై ఇంత అక్కసా

**గుడివాడ అమర్నాథ్ తీరుపై మండిపడ్డ లోకేశ్**

**రెండేళ్ల విజయాలపై 25 నుంచి ఇంటింటికీ తెలుగుదేశం**

**అమరావతి,జూన్ 16 రిపబ్లిక్ న్యూస్**
హోంమంత్రి అనితపై మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అనుచిత వ్యాఖ్యలు చేయడంపై ఆంధప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనితపై అమర్‌నాథ్ చేసిన వ్యాఖ్యలు వైసీపీ నేతల అసలు స్వరూపాన్ని **మిగతా 2లో...**




# వ్యవసాయంలో ఎఐ, టెక్నాలజీ వినియోగం పెరగాలి

**వ్యవసాయరంగంపై ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం రేవంత్ సూచన**

**సన్నరకం వరి విత్తనాలు సిద్ధం చేయండి**

**రైతు వేదికల వద్ద అందుబాటులో ఉంచండి**

**సన్నవడ్లు పండించే రైతుల డేటా సేకరించండి**

**వ్యవసాయ వర్సిటీ నోడల్ ఏజెన్సీగా సాంకేతిక సహకారం**

**హైదరాబాద్,జూన్ 16 రిపబ్లిక్ న్యూస్**
ధాన్యం దిగుబడిపైన వ్యవసాయ శాఖకు సంపూర్ణ అవగాహన ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. నిర్దేశించిన వరిరకాల విత్తనాలను రైతు వేదికలో అందుబాటులో ఉంచాలని మార్గనిర్దేశం చేశారు **మిగతా 2లో...**



# మెట్రోపై రగడ..

**ఐఆర్‌ఎఫ్‌సీ రుణాలకు సాంకేతిక ఇబ్బందులున్నాయి**

**తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది**

**మెట్రో విస్తరణకు సహకరిస్తున్నామని వ్యాఖ్య**

**అభివృద్ధిపై తమకు పాఠాలు చెప్పాల్సిన అవసరం లేదన్న కేంద్ర మంత్రి**

**తాను చెబితే ప్రాజెక్టులు ఆగవన్న కిషన్‌రెడ్డి**

**దిగజారుడు రాజకీయాలు చేయొద్దంటూ విమర్శలు**



2లో.

## టెలిగ్రామ్ యాప్‌పై కేంద్రం ఆంక్షలు

**మొదటిపేజీ తరువాయి**

యాక్సెస్‌పై నియంత్రణ ఉండనుంది. ఈనెల 21న దేశవ్యాప్తంగా నీట్ 2026 రీ-ఎగ్జామ్ నిర్వహించనున్న నేపథ్యంలో, పరీక్ష భద్రతను దృష్టిలో ఉంచుకుని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ సిఫార్సు మేరకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.అలాగే, టెలిగ్రామ్‌లో ఈనెల 30 వరకు మెసేజ్ ఎడిటింగ్ ఫీచర్‌ను పూర్తిగా నిలిపివేయాలని ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. పరీక్ష పూర్తయిన తర్వాత పాత టైమ్‌స్టాంప్‌లతో నకిలీ 'పేపర్ లీక్' ఆధారాలు సృష్టిస్తున్న ముఠాలను అడ్డుకోవడానికే మెసేజ్ ఎడిటింగ్ ఫీచర్‌పై నిషేధం విధించినట్లు తెలుస్తోంది. పేపర్ లీక్ పేరుతో విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్న నకిలీ టెలిగ్రామ్ ఛానళ్లపై ఇప్పటికే సైబర్ క్రైమ్ విభాగాలు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. అహ్మదాబాద్‌లో 8 టెలిగ్రామ్ ఛానళ్లను నడుపుతూ రూ.1.5 కోట్ల మోసాలకు పాల్పడిన అంతర్రాష్ట్ర ముఠాను సైబర్ క్రైమ్ బ్రాంచ్ అరెస్ట్ చేసింది. జూన్ 21న జరగనున్న రీ-ఎగ్జామ్‌కు ముందు ప్రశ్నాపత్రం లీక్ అయ్యిందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాలపై ఎన్‌టిఎ స్పందించింది. అవన్నీ తప్పుడు ప్రచారాలేనని స్పష్టం చేస్తూ, విద్యార్థులు అధికారిక సమాచారం కోసం వెబ్‌సైట్ ను మాత్రమే అనుసరించాలని సూచించింది. ఎవరైనా మోసాలకు పాల్పడితే వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కి ఫిర్యాదు చేయాలని కేంద్ర ప్రభుత్వం కోరింది.

## ఎపికి చేయూత

**మొదటిపేజీ తరువాయి**

మాధవ్, ఎమ్మెల్యే సుజనా చౌదరితో కలిసి పార్కులో మొక్కలు నాటారు. అనంతరం పార్క్‌కు వచ్చిన వాకర్స్‌తో ముచ్చటించారు. దేశంలో అత్యధిక కాలం సేవలందించిన ప్రధానిగా.. నరేంద్ర మోదీ చరిత్రలో నిలిచిపోయారన్నారు. 2014కు ముందు భారత ఆర్థిక వ్యవస్థ అత్యంత క్షీణ దశలో ఉందని.. మోదీ ప్రధాని అయ్యాక అత్యంత వేగంగా అభివృద్ధి చెందే ఆర్థిక వ్యవస్థగా భారత్ రూపాంతరం చెందిందని పేర్కొన్నారు. రైల్వే ఎలక్ట్రిఫికేషన్ జరిగిన రెండో దేశం భారత్ అని వివరించారు. ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు 8 రెట్లు పెరిగాయి. అమరావతి కోసం హడ్కో నుంచీ రూ.11వేల కోట్లు ఇచ్చామన్న జోషి.. అమరావతి కనెక్ట్ చేస్తూ ప్రత్యేక రైల్వే లైన్ కోసం నిధులు సమకూర్చినట్లు గుర్తుచేశారు. రాష్ట్ర అభివృద్ధి కోసం చంద్రబాబు, పవన్, మాధవ్ కలిసి బాగా పని చేస్తున్నారని ప్రహ్లాద్ జోషి కితాబిచ్చారు. రాజధాని అమరావతికి రోడ్, రైల్వే కనెక్టివిటీ పెంచుతున్నామని వెల్లడించారు. అమరావతి అభివృద్ధికి కేంద్రం నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నట్టు చెప్పారు.

## ఫ్రాన్స్‌లో జీ7 సదస్సు..

**మొదటిపేజీ తరువాయి**




ఈ సదస్సులో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ, రష్యా చమురుపై త్వరలోనే అమెరికా మళ్లీ ఆంక్షలు విధించే అవకాశం ఉందని సంచలన ప్రకటన చేశారు. ఇరాన్‌తో ఇటీవలే కుదిరిన ఒప్పందం కారణంగా హర్మూజ్ జలసంధి గుండా చమురు సరఫరా సులభతరమైందని, ఇది రష్యాపై కఠిన చర్యలు తీసుకునేందుకు వీలు కల్పిస్తుందని ఆయన వివరించారు. ఉక్రెయిన్‌పై దాడి నేపథ్యంలో మాస్కోపై ఆర్థిక ఒత్తిడిని మరింత పెంచేందుకు జీ7 దేశాలు కొత్త మార్గాలను అన్వేషిస్తున్న తరుణంలో ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి.సాధారణంగా జీ7 సభ్య దేశాలు, తాము ఆహ్వానించిన ఇతర దేశాల అధినేతలు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో కలిసి ఈ ఔట్‌రీచ్ సెషన్‌ను నిర్వహిస్తాయి. ప్రపంచం ఎదుర్కొంటున్న కీలక ఆర్థిక, రాజకీయ సవాళ్లపై విస్తృతంగా చర్చించి, సరైన పరిష్కార మార్గాలను కనుగొనడమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశం.

## మహిళా ప్రజాప్రతినిధిపై ఇంత అక్కసా

**మొదటిపేజీ తరువాయి**

బయటపెట్టాయని ధ్వజమెత్తారు. మంగళవారం అమరావతి వేదికగా మంత్రి లోకేశ్ మీడియాతో మాట్లాడారు. తమ ప్రభుత్వ హయాంలో పాలన, అభివృద్ధి, శాంతిభద్రతలపై సమాధానాలు లేక వైసీపీ నేతలు వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని ఆగ్రహించారు. మహిళా నేత, దళిత ప్రజాప్రతినిధిని లక్ష్యంగా చేసుకోవడం వైసీపీ నీచ రాజకీయ సంస్కృతికి నిదర్శనమని లోకేశ్ మండిపడ్డారు. అనిత రాజకీయ ప్రస్థానం, కష్టపడి ఎదిగిన మహిళా వ్యక్తిత్వానికి నిదర్శనమని లోకేశ్ ప్రశంసించారు. అనితకు, మహిళలకు, దళిత సమాజానికి వైసీపీ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని మంత్రి లోకేశ్ డిమాండ్ చేశారు. ఇదిలావుంటలే లోకేశ్ టెలికాన్ఫరెన్స్ ద్వారా ఎమ్మెల్యేలు, ఎంపీలు, రాష్ట్ర, జాతీయ కార్యవర్గంతో మంగళగిరిలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. కూటమి పాలన రెండేళ్ల విజయాలపై ఈ నెల 25వ తేదీ నుంచి ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ నేతలు వెళ్లాలని పిలుపునిచ్చారు. మొత్తం 45 రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. సుమారు రెండు గంటల పాటు ఈ సమావేశం కొనసాగింది. అన్ని నియోజకవర్గాల్లో ఇంటింటికీ వెళ్లాలని యువనేత దిశానిర్దేశర చేశారు. తమ ఇబ్బందులను కొంతమంది ఎమ్మెల్యేలు లోకేశ్‌కి వివరించారు. అర్హులైన వారు కొత్త పెన్షన్లు అడుగు తున్నారని తెలిపారు. గ్రామానికి వెళ్లిన వెంటనే చిన్న చిన్న పనులు అడుగుతున్నారని, దీనికి కొంత నిధులు ఇవ్వాలని కోరారు. ఈ సమస్య తనకు కూడా ఉందని.. ఏపీ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకోవాలని ఎమ్మెల్యేలకు లోకేశ్ సూచించారు. అన్ని విషయాలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి 45 రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించాలని యువనేత మార్గనిర్దేశం చేశారు. వారానికి కనీసం నాలుగు రోజులైనా ఈ కార్యక్రమం నిర్వహించాలని లోకేశ్ ఆదేశించారు.

## వ్యవసాయంలో ఎఐ, టెక్నాలజీ వినియోగం పెరగాలి

**మొదటిపేజీ తరువాయి**

సన్నవడ్లు పండించే రైతుల డేటా సేకరించాలని ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో వ్యవసాయ శాఖపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులకు పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. బోనస్ ఇచ్చే 7 రకాల సన్న వడ్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. 7 రకాల సన్న వడ్లను సబ్సిడీపైన ఇవ్వాలని మార్గనిర్దేశర చేశారు. భద్రాద్రి కొత్తగూడెం దమ్మపేట మండలంలో ప్రారంభించిన పైలెట్ ప్రాజెక్ట్‌ను మరింతగా వినియోగించుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖలో సాంకేతికతను మరింతగా పెంచుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఏఐని మరింతగా వినియోగించాలని నిర్దేశిరచారు. అగ్రికల్చర్ యూనివర్సిటీని నోడల్ ఏజెన్సీగా పెట్టుకొని సాంకేతికతను పెంచుకోవాలని సూచించారు. సీడ్స్ నుంచి కొనుగోలు వరకు వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయిస్, అగ్రికల్చర్ యూనివర్సిటీ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మార్క్‌ఫెడ్ నష్టాలను తగ్గించుకునే ప్రయత్నాలు చేయాలని పేర్కొన్నారు. ఆయిల్ ఫెడ్‌ను బలోపేతం చేసుకోవాలని తెలిపారు. అన్ని వ్యవసాయ మందులకు సంబంధించి ఓ యాప్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. యాప్ ద్వారా బుక్ చేసుకునే యూరియాను రైతు వేదిక ద్వారా పంపిణీ చేయాలని అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్‌కు యూరియా పంపిణీ బాధ్యతను అప్పగించాలని ఆదేశించారు. యూరియా, ఇతర ఎరువుల కేటాయింపులపై ఎప్పటికప్పుడూ కేంద్రప్రభుత్వానికి లేఖలు రాయాలని ఆదేశించారు. రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయిన ఎరువులు మొత్తం తెలంగాణకే ఇచ్చేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఎరువుల పరిస్థితిపైన అన్ని పార్టీల ఎంపీలతో ఓ సమావేశం నిర్వహించి పరిస్థితిని వివరించాలని సీఎం పేర్కొన్నారు. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

------

# అద్భుత నగరంగా అమరావతి నిర్మాణం

**మొదటిపేజీ తరువాయి**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండో రోజు పర్యటన కొనసాగుతోంది. 'వరల్డ్ సిటీస్ సమ్మిట్'లో పాల్గొన్న సీఎం.. లీడర్‌షిప్ ప్లీనరీ-2లో 'కెన్ స్మార్ట్ సిటీస్ లవ్ హ్యూమన్స్' అనే అంశంపై ప్రసంగించారు. అమరావతిని నాలెడ్జ్ సిటీగా చేస్తున్నామని.. జాతీయ, అంతర్జాతీయ విద్యాసంస్థలను తీసుకువస్తున్నామని అన్నారు. క్వాంటం కంప్యూటింగ్ హబ్, డిజిటల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రత్యేక ఆకర్షణలన్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంగా అమరావతి నిర్మాణం అవుతోందన్నారు. అమరావతిని సందర్శించి.. సరికొత్త ఆలోచనలతో అవకాశాలను వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. 25 ఏళ్ల క్రితం ఐటీ గురించి మాట్లాడానని... ఫస్ట్ మూవర్ అడ్వాంటేజ్‌తో ఈరోజు తెలుగువాళ్లు తలసరి ఆదాయంలో ముందున్నారని తెలిపారు. ఇప్పుడు ఏఐ వచ్చిందన్నారు. నాడు సైబరాబాద్‌ను అభివృద్ధి చేశామని... నేడు తెలంగాణకు ప్రధాన ఆదాయవనరుగా మారిందని చెప్పారు. రాష్ట్ర విభజనతో మరో నగరాన్ని నిర్మించే అవకాశం వచ్చిందని... అమరావతిని గ్రీన్ ఫీల్డ్ సిటీగా నిర్మిస్తున్నామని వెల్లడించారు. కృష్ణానది, ఇన్నర్ - ఔటర్ రింగ్ రోడ్లు, ఐకానిక్ బ్రిడ్జిలతో అద్భుతంగా అమరావతి రూపుదిద్దుకుంటోందని వివరించారు. స్పోర్ట్స్, ఫైనాన్సియల్, నాలెడ్జ్, జస్టిస్, టూరిజం, హెల్త్, మీడియా వంటి కాన్సెప్ట్ తీసుకున్నామన్నారు. ఒకే ఒక్క పిలుపుతో రాజధాని కోసం రైతులు 35 వేల ఎకరాలను అప్పగించారని... వాటిలో కొంత భాగాన్ని అభివృద్ధి చేసి రైతులకు తిరిగి ప్లాట్లు ఇస్తున్నామన్నారు. 21 కి.మీ పొడవునా వాటర్ ఫ్రంట్ నగరంగా అమరావతి ఉంటుందని తెలిపారు. సైక్లింగ్, వాకింగ్ ట్రాక్, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్, అండర్ గ్రౌండ్ యుటిలిటీస్, గ్రీన్ ఎనర్జీ, నెట్ జీరో లక్ష్యంగా రాజధాని నిర్మాణం జరుగుతోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. సైబరాబాద్‌లో నాడు ఎకరం రూ.2 లక్షలు ఉంటే... నేడు రూ.200 కోట్లకు పెరిగిందన్నారు. అభివృద్ధి జరిగితే సంపద సృష్టి సాధ్యమవుతుందనేందుకు సైబరాబాద్ నిదర్శనమని తెలిపారు.

సింగపూర్‌తో భారత్‌కు, ప్రత్యేకించి ఏపీకి మంచి సంబంధాలు ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. సింగపూర్ నిర్మాత లీ క్వాన్ యూ అంటే తనకు చాలా అభిమానమని పేర్కొన్నారు. మూడు దశాబ్దాల క్రితం నుంచే సింగపూర్‌తో కలిసి పనిచేస్తున్నామని వివరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్‌లో సింగపూర్ టౌన్ షిప్‌నే నిర్మించామని ప్రస్తావించారు. మంగళవారం సింగపూర్‌లో సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్-2026 బిజినెస్ రోడ్ షోకి సీఎం చంద్రబాబు హాజరయ్యారు. ఈ ఏడాది నవంబర్‌లో జరగనున్న పార్టనర్‌షిప్ సమ్మిట్ సన్నాహక సమావేశంగా సింగపూర్‌లో తొలి రోడ్ షోని సీఐఐ నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత కొత్త రాజధాని నిర్మాణం కోసం సింగపూర్ మాస్టర్ ప్లాన్‌ని తయారు చేశామని తెలిపారు. బ్లూ, గ్రీన్ రాజధానిగా అమరావతి నిర్మాణం కోసం ఓ అద్భుతమైన బృహత్ ప్రణాళికను సింగపూర్ రూపొందించిందని వెల్లడించారు. ఏపీ రాజధాని అమరావతితో పాటు రాష్ట్రంలోని నగరాల అభివృద్ధి తదితర అంశాల్లో సింగపూర్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. సింగపూర్ తర్వాత పెట్టుబడులు పెట్టాలనుకుంటే ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ ప్రాంతమని స్పష్టం చేశారు. సింగపూర్ తర్వాత రెండో నివాసంగా అమరావతిని, ఏపీని మార్చుకోమని పారిశ్రామిక వేత్తలకు పిలుపునిచ్చారు. ఏపీలో భూమి, అనుమతులను వేగంగా జారీ చేస్తున్నామని తెలిపారు. ప్రపంచ దిగ్గజ స్టీల్ కంపెనీ ఆర్సెలార్ మిట్టల్‌కు అన్ని అనుమతులు వేగంగా ఇచ్చామని చెప్పుకొచ్చారు. 2028 నాటికి ఆర్సెలార్ మిట్టల్ ఉత్పత్తి కూడా ప్రారంభించి ఏపీ నుంచి ఎగుమతులు చేస్తుందని తెలిపారు. అలాగే గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటవుతుందని.. వారికి గ్రీన్ ఎనర్జీని సరఫరా చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు. పెట్టుబడులు వచ్చిన మరుక్షణం నుంచే పరిశ్రమలు ప్రారంభించేలా ఓ నిర్దిష్టమైన కాలవ్యవధిని నిర్ణయిస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. గూగుల్‌తో పాటు దాదాపు 10 గిగావాట్ల సామర్థ్యం ఉన్న డేటా సెంటర్లను వివిధ కంపెనీలు ఏర్పాటు చేయబోతున్నాయని ప్రస్తావించారు. ఎల్జీ ఎలక్ట్రానిక్స్ కూడా రూ.7 వేల కోట్లతో శ్రీసిటీలో గృహోపకరణాల తయారీ యూనిట్‌ను ప్రారంభిస్తోందని తెలిపారు. ఏపీలో అమలవుతున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ఇవి ప్రత్యక్ష ఉదాహరణలని చెప్పుకొచ్చారు. నైపుణ్యం ఉన్న మానవ వనరులను తయారు చేసేందుకు ఆపరేషనల్ స్కిల్ యూనివర్శిటీనీ కూడా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. పనిచేస్తూనే నైపుణ్యాలు, ఉన్నత విద్యార్హతలను సాధించేలా ఈ ఆపరేషనల్ యూనివర్శిటీలు ఉపకరిస్తాయని తెలిపారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా టెక్నాలజీ విస్తృతి పెరిగిందని.. దీని ఆధారంగానే నిర్ణయాలు ఉంటున్నాయని చెప్పుకొచ్చారు. ఏపీలోనూ అదే తరహాలో డేటా డ్రివెన్ నిర్ణయాలను తీసుకుని పౌరసేవల్ని అందిస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# క్లీన్ గోదావరిని ప్రక్షాళన చేయండి

**మొదటిపేజీ తరువాయి**

నుంచి కోట్లాది మంది వస్తారు. వారికి గోదావరినది గొప్పతనం తెలిపేలా, నదిని అత్యంత శుభ్రంగా ఉంచాలన్నది కూటమి ప్రభుత్వ ఆలోచన. అయితే గోదావరి నది కాలుష్యం, శుద్ధి చేయని నీరు ప్రత్యక్షంగా నదిలో కలవడం వంటి సవాళ్లు ముడిపడి ఉన్నాయి. వీటిని అధిగమించేందుకు కేంద్రం తగిన విధంగా సహకారం అందించాలి. మున్సిపాలిటీల్లో నీటి శుద్ధి కేంద్రాలను మరిన్ని నిర్మించి మురుగు నీటిని గోదావరిలో కలవకుండా నివారించాల్సిన అవసరం ఉంది. దీనిపై కేంద్ర మంత్రివర్యులతో సుదీర్ఘంగా చర్చించాం. ఎక్కడి నుంచి కాలుష్యం అధికంగా ఉంది.. నివారణ చర్యలు ఎలా తీసుకోవాలి అనే అంశాలను చర్చించాం. ఘన, ద్రవ వ్యర్థాలు గోదావరిలో ప్రత్యక్షంగా కలవకుండా ఎలా నివారించాలి అన్న అంశాలను మంత్రివర్యుల దృష్టికి తీసుకువెళ్లాం. పుష్కరాలకు ముందే గోదావరి కాలుష్యాన్ని నివారించే చర్యలు తీసుకుంటాం. దీనికి కేంద్రం కూడా తగిన విధంగా సహకరిస్తుంది కేంద్ర మంత్రివర్యులు హామీ ఇచ్చారు. పుష్కరాలను కాలుష్య రహితంగా ఎలా నిర్వహించవచ్చు అన్న అంశాలతో మంత్రి గారికి నివేదిక రూపంలో అందించాం. కేంద్ర మంత్రి ఆ నివేదికను పరిశీలించి కూటమి ప్రభుత్వ విజన్ ను అభినందించారు. పుష్కరాల నిమిత్తం మోడల్ పంచాయతీల అభివృద్ధి, భక్తుల రద్దీ నియంత్రణ, సౌకర్యాల కల్పన అంశాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రణాళికలు అద్భుతంగా ఉన్నాయని కేంద్ర మంత్రివర్యులు ప్రశంసించారు. గతంలో సూరత్, వారణాసి, ప్రయాగ్ రాజ్ లలో నిర్వహించి మహాకుంభ్ లో చేసిన ఏర్పాట్లు, భక్తుల రద్దీ నియంత్రణ తరహా మోడల్ ను వచ్చే పుష్కరాల్లో అమలు చేసే విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సహకరించాలని కోరాం. జల్ జీవన్ మిషన్ కు కేంద్రం నుంచి మరింత సహకారం అందించాలని కోరాం"ని అన్నారు.

# మెట్రోపై రగడ.. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది

### రేవంత్ వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించన కిషన్ రెడ్డి

**న్యూఢిల్లీజూన్ 16 రిపబ్లిక్ న్యూస్**

తెలంగాణ అభివృద్ధిపై తమకెవరూ పాఠాలు చెప్పాల్సిన పనిలేదని, ఎవరి కోసమో తాము తెలంగాణ అభివృద్ధికి పాటుపడడం లేదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. దేశవ్యాప్తంగా మిగతా మెట్రో రైలు ప్రాజెక్టుల మాదిరిగానే హైదరాబాద్ మెట్రోకు కేంద్ర ప్రభుత్వం సహకారమందిస్తోందని కిషన్‌రెడ్డి అన్నారు. సాంకేతిక, ఆర్థిక విషయాలపై కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వాలు సహకరిస్తే ప్రాజెక్టులు సాకారమవుతాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విమర్శల నేపథ్యంలో దిల్లీలో కిషన్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. తాను వద్దంటే ప్రాజెక్టులు ఎక్కడా ఆగవని చెప్పారు. మెట్రో ప్రాజెక్టుకు సంబంధించి అనేక మార్పులను రాష్ట్రానికి కేంద్రం సూచించిందన్నారు. ప్రాజెక్టులను దొడ్డిదారిన ఆపే సంస్కృతి భాజపాకు లేదని.. కాంగ్రెస్‌కే ఉండొచ్చని వ్యాఖ్యానించారు. ఎవరి కోసమూ ప్రాజెక్టులను అడ్డుకోబోమన్నారు.

తెలంగాణ అభివృద్ధి పట్ల మాకు చిత్తశుద్ధి ఉంది. గతంలో మెట్రో ఫేజ్-1కు కేంద్రం రూ.1,250 కోట్లు మంజూరు చేసింది. అనాలోచితంగా, దుందుడుకు ధోరణిలో సీఎం మాట్లాడటం సమంజసం కాదు. నాతో పాటు ప్రధాని మోదీ, కేంద్రానికి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ సర్టిఫికెట్ అవసరం లేదు. మేం రేవంత్‌రెడ్డికి కాదు.. తెలంగాణ ప్రజలకు జవాబుదారీ. రాష్ట్ర అభివృద్ధి కోసం 12 ఏళ్లుగా పనిచేశాం.. ఇప్పుడూ పనిచేస్తాం. ఇచ్చిన హామీలను తు.చ. తప్పకుండా అమలు చేస్తున్నాం. తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధి పట్ల మాకెవరూ పాఠాలు చెప్పనక్కర్లేదన్నారు. తెలంగాణ బిడ్డగా ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాటం చేశాను. దిల్లీకి వచ్చి రెండుసార్లు ధర్నా చేశాం. బిల్లు ఆమోదం పొందిన తర్వాతే ఏపీ భవన్‌లో ఆమరణ దీక్ష విరమించా. రైల్వేస్టేషన్ల అభివృద్ధి కోసం నాడు కేసీఆర్, నేడు రేవంత్‌రెడ్డికి లేఖలు రాశా. రేవంత్ కోరితే కాకుండా.. కేంద్ర ప్రభుత్వమే బాధ్యతగా తీసుకుని రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులు చేపట్టింది. ఎంఎంటీఎస్ ఫేజ్-2కు నాడు కేసీఆర్ సహకరించలేదు. అయినప్పటికీ ప్రధాని చేతులమీదుగా ప్రారంభించాం. తెలంగాణకు రాదనుకున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీని సాధించాం. రాష్ట్రాల్లో ఏ పార్టీకి చెందిన ప్రభుత్వాలు ఉన్నా అందరికీ కేంద్రం సహకారం అందిస్తోంది. మోదీ ఇస్తుంటే కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నారనడం దిగజారుడు రాజకీయాలని మండిపడ్డారు. 50 ఏళ్లు వడ్డీ లేకుండా రాష్ట్రానికి ఇటీవల సాస్కీ రుణాలను కేంద్రం మంజూరు చేసింది. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు ఏడీబీ రుణానికి కేంద్రం ఎన్వోసీ ఇచ్చింది. ఎన్‌సీడీసీ ద్వారా పదేళ్లుగా తెలంగాణకు రూ.లక్ష కోట్లు మంజూరు చేశాం. ధాన్యం కొనుగోళ్లకు రూ.37వేల కోట్లు మంజూరు చేసి.. ఇప్పటికే రూ.34వేల కోట్లు అందించాం అని కిషన్‌రెడ్డి వివరించారు.తెలంగాణ అభివృద్ధిపై తమకు చిత్తశుద్ధి ఉందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మెట్రో అంశంలో బీజేపీపై బురదజల్లుతున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై ఆయన మండిపడ్డారు. మెట్రో రైలు ప్రాజెక్ట్ ఆపాలని తానేందుకు చెబుతానంటూ ఈ సందర్భంగా అసహనం వ్యక్తం చేశారు. తెలంగాణలో కేంద్రం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోంది. ఒక లక్షా 75 వేల కోట్ల రూపాయలతో రహదారులను అభివృద్ధి చేస్తున్నాం. రాష్ట్ర అభివృద్ధి మా బాధ్యత' అని కిషన్ రెడ్డి పునరుద్ఘాటించారు. తనపై సీఎం రేవంత్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ అనాలోచితంగా మాట్లాడుతున్నారన్న ఆయన.. తమకు రేవంత్‌రెడ్డి సర్టిఫికెట్ ఏమీ అవసరం లేదన్నారు. అభివృద్ధి అంశంలో తమకు పాఠాలు నేర్పాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ నేతలకు సూచించారు.

# జులై మూడో వారంలో తల్లికి వందనం..

**మొదటిపేజీ తరువాయి**

విద్యార్థుల తల్లులకు ఆర్థిక సాయం అందించే 'తల్లికి వందనం' పథకాన్ని జులై మూడో వారంలో అమలు చేసేందుకు సిద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. దీంతో పాటు, పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్య వరకు పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు.

ఉండవల్లిలోని తన నివాసంలో పాఠశాల, ఉన్నత విద్యాశాఖల అధికారులతో మంత్రి సుదీర్ఘంగా సమీక్షించారు. 'తల్లికి వందనం' పథకం అమలుపై ప్రధానంగా చర్చించారు. తల్లుల ఆధార్ వెరిఫికేషన్ ప్రక్రియ దాదాపుగా పూర్తయిందని, జులై మూడో వారంలో పథకాన్ని అమలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు మంత్రికి వివరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని లోకేశ్ స్పష్టం చేశారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు జూన్ 29న 'షైనింగ్ స్టార్స్' కార్యక్రమం, తల్లిదండ్రులను భాగస్వాములను చేసేందుకు జులై మూడో వారంలో 'మెగా పీటీఎం' నిర్వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. మిగులు ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియపైనా చర్చించారు.

పాఠశాల విద్యపై సమీక్ష అనంతరం, ఉన్నత విద్యారంగంపై మంత్రి లోకేశ్ దృష్టి సారించారు. రాష్ట్రంలో నిర్వహించే ఎప్‌సెట్, పాలిసెట్, ఆర్‌సెట్ వంటి 12 రకాల ఉమ్మడి ప్రవేశ పరీక్ష (సెట్)ల నిర్వహణలో ఎలాంటి జాప్యం జరగకూడదని గట్టిగా ఆదేశించారు. సాధ్యమైనంత త్వరగా నోటిఫికేషన్లు విడుదల చేసి, నిర్ణీత గడువులోగా అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. జాతీయ స్థాయి పరీక్షలు, పొరుగు రాష్ట్రాల సెట్ల తేదీలను దృష్టిలో ఉంచుకుని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా షెడ్యూల్ ఖరారు చేయాలని స్పష్టం చేశారు.

రాష్ట్రంలోని 254 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో 1.88 లక్షల ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి ఎప్‌సెట్ నోటిఫికేషన్ సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలల్లో సీట్ల పెంపును పరిశీలించాలని, ముఖ్యంగా డిమాండ్ ఉన్న మెకానికల్, సివిల్ బ్రాంచ్ లపై దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రానికి ప్రపంచస్థాయి విద్యాసంస్థలను తీసుకురావడం ద్వారా ఉన్నత విద్యా ప్రమాణాలను పెంచాలని మంత్రి ఆకాంక్షించారు. థాపర్ ఇనిస్టిట్యూట్, జేమ్స్ కుక్ యూనివర్సిటీ, మెల్ బోర్న్ యూనివర్సిటీ వంటి ప్రతిష్ఠాత్మక జాతీయ, అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రంలో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేసేందుకు చూపుతున్న ఆసక్తిపై చర్చించారు. ముఖ్యంగా, జీఎంఆర్ మాన్సాస్ ఏవియేషన్ యూనివర్సిటీ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని లోకేష్ ఆదేశించారు.

ఇదే సమయంలో, రాష్ట్రంలో ఎన్‌సీసీ కార్యకలాపాలను సమన్వయం చేసేందుకు ప్రత్యేక 'ఎన్‌సీసీ స్టేట్ డైరెక్టరేట్'ను మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వానికి మంత్రి ధన్యవాదాలు తెలిపారు. ఈ నిర్ణయంతో ఏపీ యువతకు సైనిక శిక్షణలో మరిన్ని అవకాశాలు లభిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి జె. శ్యామలరావు, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తమీమ్ అన్సారియా, ఉన్నతవిద్యా కమిషనర్ నారాయణ్ భరత్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# 40% సబ్సిడీతో రైతులకు వేరుశనగ విత్తనాల పంపిణీ

**దేవనకొండలో ఖరీఫ్-2026 సన్నాహక కార్యక్రమం- రైతులకు ఎరువులు, విత్తనాలపై అవగాహన:-వ్యవసాయ అధికారి బి. ఉషారాణి**





**దేవనకొండ, జూన్ 16( ప్రజా రిపబ్లిక్ న్యూస్ ):-**
ఖరీఫ్ సీజన్2026ను దృష్టిలో ఉంచుకుని దేవనకొండ గ్రామంలో మండల వ్యవసాయ అధికారి బి. ఉషారాణి ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా రైతులకు 40 శాతం సబ్సిడీపై వేరుశనగ విత్తనాలను అందజేశారు. ఒక యూనిట్ వేరుశనగ విత్తనాల పూర్తి ధర రూ.10,200 కాగా, ప్రభుత్వం రూ.4,080 సబ్సిడీ అందిస్తోంది. రైతు వాటా రూ.6,120 మాత్రమే చెల్లించి విత్తనాలను పొందవచ్చని అధికారులు తెలిపారు.రైతు సేవా కేంద్రాల్లో వేరుశనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన రైతులు ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్‌తో వెళ్లి నమోదు చేసుకుని విత్తనాలను పొందాలని కోరారు.అలాగే దేవనకొండ మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో యూరియా, డీఏపీ ఎరువులు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు.[illegible]×మీ యాప్ ద్వారా ఎరువుల పంపిణీ జరుగుతుందని, భూమి కలిగిన రైతులకు మాత్రమే ఎరువులు అందజేయబడతాయని అధికారులు స్పష్టం చేశారు.రైతులు తమ గ్రామానికి సంబంధించిన రైతు సేవా కేంద్రంలోనే ఎరువులు, విత్తనాలు పొందాలనిసూచించారు. ఖరీఫ్ సీజన్‌లో నాణ్యమైన విత్తనాలు, ఎరువులను సకాలంలో వినియోగించుకుని అధిక దిగుబడులు సాధించాలనిరైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ విజయ భాస్కర్ గౌడ్, మాజీ ఎంపీటీసీ ఆకుల వీరేష్, వెలమకూరు మాజీ సర్పంచ్ విజయ్ భాస్కర్, కూటమి నాయకులు పాల్గొన్నారు. అలాగే ఏఈఓ రంగన్న, మల్లికార్జున, వీఎచ్ఏ హసీనా, వీఏఏ కళావతి, పలువురు రైతులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

# అభివృద్ధి పేరుతో భూ దోపిడీ

## కార్పొరేట్ దోపిడీ సామ్రాజ్యవాదానికి సేవలే మోడీ పాలన అసలు స్వరూపం

**దేవనకొండ జూన్ 16 (ప్రజా రిపబ్లిక్ న్యూస్):-**
దేశంలో రాష్ట్రంలో అభివృద్ధి పేరుతో భారీ దోపిడీ జరుగుతుందని ప్రధానంగా ఈ దోపిడి భూమి పై,పేదలపై,మధ్య తరగతి పై జరుగుతున్నది రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. లోకనాథం విమర్శించారు...

దేవనకొండ మండల కేంద్రంలో స్థానిక సియల్ ఆర్సి భవన్ లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు బి. వీరశేఖర అధ్యక్షతన జరిగింది ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ

దేశ సంపదను కొద్దిమంది కార్పొరేట్ గుత్తాధిపతులకు కట్టబెడుతూ, లక్షల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వారి ఖజానాల్లోకి మళ్లిస్తున్న మోడీ ప్రభుత్వం ప్రజల ప్రయోజనాల కోసం కాకుండా కార్పొరేట్ వర్గాల కోసం పనిచేస్తోందని ఆయన మండిపడ్డారు. అమెరికా సామ్రాజ్యవాద ప్రయోజనాలకు అనుగుణంగా దేశ విదేశాంగ, ఆర్థిక విధానాలను మలుస్తూ భారత ఆర్థిక స్వావలంబనను, జాతీయ ప్రయోజనాలను తాకట్టు పెడుతోందని విమర్శించారు.

దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని, వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్, ఆహార ధాన్యాలు, కూరగాయలు, విద్య, వైద్యం అన్నీ సామాన్య ప్రజలకు అందని భారంగా మారాయని పేర్కొన్నారు. కోట్లాది యువత నిరుద్యోగంతో అల్లాడుతుంటే, మోడీ ప్రభుత్వం మాత్రం ప్రచార ఆర్భాటాల్లో మునిగిపోయిందని విమర్శించారు.

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరచడమే కాకుండా, దాని స్థానంలో "జీ-రామ్" పేరుతో కొత్త చట్టాన్ని తీసుకువచ్చి జూలై 1 నుంచి అమలు చేస్తున్నారని, ఇది గ్రామీణ పేదల ఉపాధి హక్కుపై ప్రత్యక్ష దాడి అని అన్నారు.

అభివృద్ధి, పారిశ్రామికీకరణ, గ్రీన్ ఎనర్జీ, కారిడార్లు, ఎక్స్‌ప్రెస్‌వేలు, గనుల విస్తరణ పేర్లతో దేశవ్యాప్తంగా లక్షల ఎకరాల భూములను రైతులు, వ్యవసాయ కార్మికులు, ఆదివాసీల నుంచి బలవంతంగా లాక్కొని




కార్పొరేట్ కంపెనీలకు అప్పగిస్తున్నారని అన్నారు. భూమిని కోల్పోయిన పేదలు ఉపాధి, జీవనాధారం కోల్పోయి వలస కార్మికులుగా మారుతున్నారని పేర్కొన్నారు.

భూములను బలవంతంగా స్వాధీనం చేసుకునే ప్రతి ప్రయత్నాన్ని గ్రామ స్థాయిలోనే అడ్డుకోవాలని, భూమి కోసం, జీవన హక్కుల కోసం, అటవీ హక్కుల కోసం గ్రామాలనే పోరాట కేంద్రాలుగా మార్చాలని పిలుపునిచ్చారు. భూమి లాక్కునే కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా గ్రామ గ్రామాన ప్రతిఘటన కమిటీలను నిర్మించి ఉద్యమాలను విస్తరించాలని అన్నారు.దేశంలో పెరుగుతున్న అసంతృప్తి, నిరుద్యోగ యువతలో ఆగ్రహం, రైతులు-కార్మికుల్లో పెరుగుతున్న వ్యతిరేకతకు ఇటీవల దేశం లో వేగంగా పెరుగుతున్న "కాక్రిచ్ జనతా పార్టీ" వంటి శక్తుల ఎదుగుదల కూడా ఒక ప్రతిబింబమని పేర్కొన్నారు. ఇది బీజేపీ పాలనపై ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేక భావనకు నిదర్శనమని అన్నారు. వ్యవసాయ కార్మికులు, దళితులు, మహాదళితులు, వెనుకబడిన వర్గాలు దోపిడీకి గురవుతున్నారని పేర్కొన్నారు. ఉపాధి లేకపోవడంతో లక్షలాది మంది యువకులు, కార్మికులు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు. గ్రామీణ పేదరికం, నిరుద్యోగం, భూమిలేని స్థితి, సామాజిక అణచివేత ఇంకా తీవ్రమైన సమస్యలుగా కొనసాగుతున్నాయని వివరించారు.

**పోరాటాలే ప్రత్యామ్నాయం**

వ్యవసాయ కార్మికులు, పేద రైతులు, దళితులు, గిరిజనులు, మహిళలు, యువత ఐక్యమై గ్రామాలను ఉద్యమాల కేంద్రాలుగా మార్చాలని, భూమి స్వాధీనాలకు, ఉపాధి హక్కులపై దాడులకు, రాజ్యాంగంపై జరుగుతున్న దాడులకు ప్రతిఘటనను మరింత ఉధృతం చేయాలనీ పిలుపునిచ్చారు

భూమి దోచుకుంటే ప్రతిఘటిస్తాండ ఉపాధి హక్కు లాక్కుంటే పోరాడతాండ రాజ్యాంగంపై దాడి చేస్తే ఎదురొడతాండ మతోన్మాదం, కార్పొరేట్ దోపిడీ, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా వ్యవసాయ కార్మికులు, పేద రైతులు, దళితులు, గిరిజనులు, మహిళలు, యువత ఐక్య పోరాటాలను నిర్మించాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ నారాయణ జిల్లా ఆఫీస్ బేరర్స్ లింగన్న, నాగన్న, తిక్కన్న, బాలకృష్ణ, శ్రీరాములు మండలాల కార్యదర్శులు బుజ్జులు, శికామణి, శ్రీనివాసులు, కృష్ణ ,మహబూబ్ బాషా ,యూసుఫ్ భాష , ఈరన్న, మధు ,గోపాల్, నాగేంద్ర, దేవేంద్ర , రవి,స్థానిక ప్రజాసంఘాల నాయకులు అశోక్ మహేంద్ర నాగేంద్ర

# బలవంతపు బదిలీలకు హైకోర్టు బ్రేక్

**కేజీబీవీ ఉద్యోగుల పోరాటానికి న్యాయబలం -తాత్కాలిక నియామకాలకు అనుమతి లేదన్న న్యాయస్థానం**

**42 మంది కేజీబీవీ ఉద్యోగులకు ఊరట -ఫోరం జేఏసీ హర్షం**






**అనంతపురంజూన్ 16,(రిపబ్లిక్ న్యూస్):**
ఉమ్మడి అనంతపురం జిల్లా కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల (కేజీబీవీ) ఉద్యోగుల బలవంతపు బదిలీల వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కీలక మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. పిటిషనర్ల స్థానాల్లో తాత్కాలిక ఉద్యోగులను నియమించవద్దని స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో ఉద్యోగుల న్యాయపోరాటానికి న్యాయబలం లభించిందని ఏపీ ఎస్ఎస్ఏ కేజీబీవీ ఉద్యోగుల ఫోరం జేఏసీ పేర్కొంది.స్పష్టమైన మార్గదర్శకాలు, ప్రొసీడింగ్స్ లేకుండానే మే 4న జిల్లా సైన్స్ సెంటర్‌కు పిలిపించి టీచింగ్ సిబ్బందికి బలవంతపు బదిలీలు చేపట్టేందుకు అధికారులు ప్రయత్నించారని ఫోరం ఆరోపించింది. పారదర్శకంగా బదిలీలు నిర్వహించాలని కోరడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొని ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేశారని తెలిపింది. అనంతరం కలెక్టరేట్‌లో కొంతమందికి ఏకపక్షంగా బదిలీలు చేపట్టారని పేర్కొంది.ఈ చర్యలను సవాలు చేస్తూ బాధిత ఉద్యోగులు, ఫోరం జేఏసీ తరఫున ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో డబ్ల్యూపీ నంబర్ 14087/2026 దాఖలు చేయగా, ఉద్యోగుల వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం వారికి రక్షణ కల్పించేలా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.ఉమ్మడి అనంతపురం జిల్లాలో బలవంతపు బదిలీలకు గురైన 14 మంది ప్రిన్సిపల్స్, 28 మంది టీచింగ్ సిబ్బంది సహా మొత్తం 42 మంది ఉద్యోగులకు ఈ తీర్పు ఊరటనిచ్చిందని ఫోరం జేఏసీ తెలిపింది. ఉద్యోగుల ఐక్యత, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల మద్దతు, న్యాయపోరాటం ఫలితంగానే ఈ విజయం సాధ్యమైందని పేర్కొంది.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి



**కల్లూరు ప్రతినిధి, జూన్ 16(రిపబ్లిక్ న్యూస్)** ముఖ్యమంత్రి సహాయ నిధి పేద రోగులకు కొండంత అండ అని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.మంగళవారం పాణ్యం నియోజకవర్గం కల్లూరులోని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఎంపీ కార్యాలయంలో నంద్యాల పార్లమెంట్ పరిధిలో ఉన్న ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు బాధితులకు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చేతుల మీదుగా పంపిణీ చేశారు. మిద్దూరు మండలం చెరుకుచర్ల గ్రామం రామసుబ్బమ్మకు రూ. 1,95,858 లు, గోస్పాడు మండలం దీబగుంట్ల గ్రామం లక్ష్మీ దేవికి రూ. 1.64,191లు, దొర్నిపాడు మండలం చాకరాజువేముల గ్రామం లింగమ్మ కు రూ. 2,32,171లు, పగిడ్యాల మండలం, పాత ముచ్చుమర్రి గ్రామం అనురాధకు 3,01,617 లు, శిరివెళ్ల మండలం, యర్రగుంట్ల గ్రామం బి. కుమార్ కు రూ. 1,83,706 లు, కొత్తపల్లి మండలం, గువ్వలకుంట్ల గ్రామం నాగేశ్వరరెడ్డి కి రూ. 1,40,852 లు, గోస్పాడు మండలం, దీబగుంట్ల గ్రామం వెంకటేశ్వర్లు కు రూ. 50,524 లు, ఆళ్ళగడ్డ మండలం పాలసాగరం గ్రామం అల్లాభకాష్ కు రూ. 46,600 లు, పగిడ్యాల మండలం పాత ముచ్చుమర్రి గ్రామం శ్రీనివాసులు కు రూ. 40,350 లు, మహానంది మండలం, మసీదుపురం గ్రామం మల్లికార్జున కు రూ. 1,16,756లు, ఉయ్యాలవాడ మండలం, హరివరం గ్రామం కాకర్ల జ్యోతి కి రూ. 1,05,953 లు, ఓర్వకల్ మండలం గుట్టపాడు గ్రామం శ్రీనివాసులు కు రూ. 1,19,558లు, కొలిమిగుండ్ల గ్రామం కు చెందిన శివ లక్ష్మమ్మ కు రూ. 1,01,850 లు, నందికొట్కూరు మండలం అల్లూరు గ్రామం పద్మావతి కిఫ రూ. 1,37,605 లు, పాములపాడు మండలం, మిట్టకంధాల గ్రామం కోటేశ్వరరెడ్డి కి రూ. 83,509 లు, నంద్యాల రామనాథ్ రెడ్డి నగర్ కు చెందిన గొల్ల ఉసెన్ కు రూ. 2,13,577 లు, ఉయ్యాలవాడ మండలం, హరివరం గ్రామం ఎం. పెద్ద చంద్రయ్య కు రూ. 1,05,953 లు, ఆత్మకూరు మండలం పిన్నాపురం గ్రామం ఎం. చిన్న తిమ్మారెడ్డి కి రూ 89,520 లు, బేతంచెర్ల వెంకట జితేంద్రరెడ్డి కి రూ. 30,000 లు, ఇలా మొత్తం 19 మందికి రూ. 24,60,151 లక్షలు, సీఎం సహాయనిధి ముందస్తు అనుమతి రూ. 6 లక్షలు, మొత్తం రూ. 30,60,151 లక్షల చెక్కులు బాధితులకు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పంపిణీ చేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందుకున్న భాధితులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

# డిసిసిబిలో డిపాజిట్లకు భద్రత : నాగవేణి




**చౌడేపల్లి ప్రతినిధి జూన్ 16 రిపబ్లిక్ న్యూస్** డిసిసి బ్యాంకుల్లో డిపాజిట్లకు భద్రత ఉంటుందని బ్యాంకు మేనేజర్ నాగవేణి అన్నారు మంగళవారం చౌడేపల్లి బ్రాంచ్ నందు వినియోగదారుల సమావేశం జరిగింది డిసిసి బ్యాంకులో అత్యధిక వడ్డీ డిపాజిట్ పై ఉంటుందన్నారు రైతులకు దీర్ఘ స్వల్పకాలిక రుణాలు మంజూరు చేస్తారన్నారు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు హౌసింగ్ లోన్ అందివ్వడం జరుగుతుందన్నారు బంగారు పై రుణాలు సైతం అందిస్తామన్నారు ఈ అవకాశాలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది వినియోగదారులు పాల్గొన్నారు.

# సన్మానించిన కూటమి నాయకులు



**చౌడేపల్లి ప్రతినిధి జూన్ 16 రిపబ్లిక్ న్యూస్**
మండల డిప్యూటీ ఎంపీడీవో గఫూర్ను కూటమి జనసేన తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు స్థానిక పరిపాలన భవనంలో నాయకులు ఆయనను కలిశారు ప్రతిదినం తెల్లవారుజామున మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో పర్యటిస్తూ పల్లె జనానికి పారిశుద్ధం పరిశుభ్రతపై అవగాహన కల్పించడం కాకుండా చెత్త సేకరణ కేంద్రాల వద్దకు వెళ్లి వర్మి కంపోస్ట్ వంటి సేంద్రియ ఎరువుల తయారీలో అందరికీ అవగాహన కల్పించే ప్రయత్నాలు చేస్తున్నారు అంతేకాకుండా ఇంటి పన్ను విషయంలో ముందంజలో ఉన్నారు ఇటీవల పెద్ద ఎల్లకుంట్లలో మంచినీటి సమస్య వస్తే విద్యుత్ అధికారులతో మాట్లాడి ట్రాన్స్ఫార్మర్ను అమర్చి తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేశారు దీంతో జనసేన నాయకుడు గందోడి చరణ్ కుమార్ రాయల్ సింగిల్ విండో చైర్మన్ హరి రాయల్ కార్తీక్ తదితరులు డిప్యూటీ ఎంపీడీవో గఫూర్ ను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

# మరణించిన మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**చౌడేపల్లి ప్రతినిధి జూన్ 16 రిపబ్లిక్ న్యూస్**
మరణించిన మిత్రుడి కుటుంబానికి సహచరులు ఆర్థిక సాయం చేశారు చౌడేపల్లి ఉన్నత పాఠశాలలో 2001-02 పూర్వపు విద్యార్థులలో ఒకరైన శ్రీనివాసులు మేస్త్రి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు చిన్న కొండా మరి కి చెందిన అతను ఆకస్మికంగా మృతి చెందాడు దీంతో పూర్వపు విద్యార్థులు అందరూ కలిసి రూ 26 వేలను మృతుడి తండ్రికి అందించారు మృతుడు శ్రీనివాసులు కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో 2001-02 పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888



# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**రాష్ట్ర ఎస్.టి. కమిషన్ సభ్యులు పి .వెంకటప్ప**

**అనంతపురం వైద్యం, జూన్ 16,(రిపబ్లిక్ న్యూస్):** నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్. టి. కమిషన్ సభ్యులు పి. వెంకటప్ప కోరారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి లోని పలు వైద్య సేవ విభాగాలను పరిశీలించారు. అనంతరం రోగులు, వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.



**పేదల సంపూర్ణ ఆరోగ్యం కోసం వైద్య సేవలు అందించాలి**

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా ఆసుపత్రికి వచ్చే ప్రజలతో వైద్య సిబ్బంది దృక్పథంతో స్పందించి ఆరోగ్య సమస్యలను సాధ్యమైనంత వరకు పరిష్కరించే విధంగా కృషి చేయాలని సూచించారు. పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఎంతోమంది నిరుపేదలు నమ్మకంతో ప్రభుత్వ ఆసుపత్రికి వస్తుంటారని అందువల్ల వైద్యులు కూడా వారి సంపూర్ణ ఆరోగ్యం కోసం తగినంతగా వైద్య సేవలు అందించాలన్నారు. ఆసుపత్రిలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తెస్తే వాటి పరిష్కారానికి ప్రభుత్వం ద్వారా తన వంతు కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా ఆసుపత్రిలో మౌలిక సదుపాయాల కల్పన, పరిశుభ్రత ,తాగునీటి వసతి అవసరమైన మేరకు రోగులకు మందుల పంపిణీ లాంటి అంశాలపై ప్రత్యేక దృష్టిని సారించాలని సూచించారు.

**పలు వార్డులలో పారిశుధ్య పనులు సక్రమంగా లేవు**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్య రంగానికి పెద్దపీట వేస్తున్నాయని వివిధ పథకాల ద్వారా రోగులకు నాణ్యమైన వైద్య సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అందువల్ల రోగులకు సరైన రోగ నిర్ధారణ చేసి వారి ఆరోగ్య సమస్యను తీర్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయా వైద్య విభాగాల అధిపతులను సూచించారు. ప్రస్తుతం పలు వార్డులలో పారిశుధ్య పనులు సక్రమంగా లేవని అసంతృప్తి వ్యక్తం చేస్తూ వాటిని మెరుగుపరచుకోవాలని, పలుచోట్ల గదుల్లో ఏసి పనిచేయడం లేదని రోగుల ద్వారా తెలియ వచ్చిందని అందువల్ల అవసరమైన మేరకు మరమ్మత్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. డాక్టర్లు, ఇతర ఉద్యోగ, సిబ్బంది అంకిత భావంతో విధులు నిర్వర్తిస్తూ సక్రమంగా పని వేళల్లో అందుబాటులో ఉంటూ రోగులకు వైద్య సేవలు అందించాలని సూచించారు. అనంతరం తల్లిపాల కేంద్రాన్ని సందర్శించి వసతులను పరిశీలించారు. అలాగే తల్లులను , కేంద్ర నిర్వాహకులను ఆత్మీయ సత్కారంచేసి అభినందించారు. అంతకుముందు ఎమర్జెన్సీ క్యాజువాలిటీ, ఓ.పి ఏఎంసీ తదితర విభాగాలను ఆయన పరిశీలించారు. అలాగే ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపర్డెంట్ డా. మల్లేశ్వరి, ఆర్. ఎం. ఓ. డా. హేమలత, పాల్గొన్నారు.

# బాల్య మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచిన స్నేహితులు

**అనంతపురం/గుత్తి, జూన్ 16: (రిపబ్లిక్ న్యూస్)** అనారోగ్య కారణాలతో ఇటీవల అకాల మరణం చెందిన తమ బాల్య మిత్రుడు సుధాకర్ కుటుంబానికి తోటి స్నేహితులు ఆర్థిక చేయూత అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. సుధాకర్ మృతితో ఆయన కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న స్నేహితులు అందరూ కలిసి స్పందించారు. తమ వంతు సహాయంగా రూ. 31 వేల నగదును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్ కుటుంబానికి భవిష్యత్తులో కూడా అన్ని విధాలుగా అండగా ఉంటామని వారు హామీ ఇచ్చారు. గుత్తి ఆర్ఎస్ జెడ్పీ బాలుర పాఠశాలలో కలిసి చదువుకున్న చిన్ననాటి స్నేహితులు తమ మిత్రుడి కుటుంబం కష్టకాలంలో ఉండగా ముందుకు వచ్చి సహాయం చేయడం పట్ల స్థానికులు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు. స్నేహబంధం, సామాజిక బాధ్యతకు ఈ చర్య నిదర్శనంగా నిలిచిందని పలువురు పేర్కొన్నారు.



# ఏటీఎంల వద్ద రాత్రివేళల్లో గట్టి నిఘా.. చోరీలు, సైబర్ మోసాల నివారణకు ప్రత్యేక చర్యలు

**అనుమానాస్పద వ్యక్తులు, పరికరాలపై వెంటనే సమాచారం ఇవ్వాలి కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్**








**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 16)** జిల్లాలోని అన్ని బ్యాంకుల ఏటీఎంల వద్ద రాత్రి వేళల్లో గట్టి నిఘా కొనసాగిస్తున్నట్లు కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ తెలిపారు. ఇటీవల ఏటీఎంలలో నగదు చోరీలు, కార్డు స్కిమ్మింగ్, సైబర్ మోసాలు మరియు ఇతర నేర కార్యకలాపాలను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న ఏటీఎంలను తరచూ తనిఖీ చేయాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించిన వెంటనే చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్పీ తెలిపారు. అదేవిధంగా బ్యాంకు నిర్వాహకులు ఏటీఎంల వద్ద సీసీ కెమెరాలు, అలారం వ్యవస్థలు, భద్రతా సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు ఏటీఎంలను ఉపయోగించే సమయంలో తమ పిన్ నంబర్‌ను గోప్యంగా ఉంచుకోవాలని, అపరిచితుల సహాయం తీసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఏటీఎంల వద్ద ఏవైనా అనుమానాస్పద పరికరాలు లేదా వ్యక్తులు కనిపించినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-112/100కు సమాచారం అందించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# పాఠశాలలను తనిఖీ చేసిన జిల్లా అధికారులు.





**రైల్వే కోడూరు జూన్ 16 రిపబ్లిక్ న్యూస్.** జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం జిల్లా అసిస్టెంట్ స్టాటికల్ అధికారి సారధి, డిస్ట్రిక్ట్ కామన్ ఎడ్యుకేషన్ బోర్డు చైర్మన్ వంశి ఓబులవారిపల్లి మండలంలో పర్యటించారు, ఓబులవారిపల్లి ఎంపీపీ స్కూల్, చిన్న ఓరంపాడు కేజీబీవీ పాఠశాలలను తనిఖీ చేసి విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు సిబ్బందితో పాఠశాల పరిస్థితుల గురించి మాట్లాడారు. ఎంపీపీ ఎస్ ఓబులవారిపల్లి పాఠశాలలో విద్యార్థుల విద్యాభ్యాసం, పాఠశాల నిర్వహణను పరిశీలించిన అనంతరం విద్యార్థులకు కలర్ పెన్సిళ్లను అందజేసి వారిని ప్రోత్సహించారు. అనంతరం కేజీబీవీ ఓబులవారిపల్లి పాఠశాలను సందర్శించి అక్కడి విద్యా బోధన, వసతి మరియు భోజన సదుపాయాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్వో సారధి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో ఉపాధ్యాయులు మరింత కృషి శ్రద్ధ వహించాలని సూచించారు. అలాగే కేజీబీవీ విద్యార్థినులకు పరిశుభ్రమైన, పోషక విలువలు కలిగిన నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సంబంధిత ఉపాధ్యాయులకు , సిబ్బందికి తెలియజేశారు. విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ పర్యటనలో ఎంఈఓ-2 రెడ్డయ్య విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపు, సంక్షేమ కార్యక్రమాల సమర్థవంతమైన అమలుపై పలు సూచనలు చేశారు, కార్యక్రమంలో ఇన్చార్జి ప్రిన్సిపాల్ సునీత ఆంగ్ల ఉపాధ్యాయురాలు శ్రావణి,ఎం ఆర్ సి, ఎం ఐ సి శంకర్ పాఠశాల సిబ్బంది విద్యార్థినిలు పాల్గొన్నారు.ది

# సంక్షేమ పాఠశాలలు పచ్చదనంతో కళకళలాడాలి: కలెక్టర్ డా. ఏ. సిరి

**నెట్ జీరో హెల్తీ క్యాంపస్‌లుగా తీర్చిదిద్దేందుకు 10 రోజుల్లో రైన్‌వాటర్ హార్వెస్టింగ్, మొక్కల నాటకం పూర్తి చేయాలని ఆదేశం**

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 16)** జిల్లాలోని సంక్షేమ పాఠశాలలు, వసతి గృహాలను నెట్ జీరో హెల్తీ క్యాంపస్‌లుగా అభివృద్ధి చేసే పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంక్షేమ శాఖ, మున్సిపాలిటీ, డ్వామా, ఆర్‌డబ్ల్యూఎస్, డీపీవో, నెట్ జీరో విభాగాల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు.






హెల్తీ క్యాంపస్‌ల అభివృద్ధిలో భాగంగా గుర్తించిన 10 పాఠశాలల్లో ఆల్ట్రా హై డెన్సిటీ మొక్కల నాటకం తక్షణమే ప్రారంభించాలని, అలాగే రైన్‌వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలను 10 రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ నరసింహారెడ్డిని ఆదేశించారు. పాఠశాలలు, వసతి గృహాలు పచ్చదనంతో నిండి, విద్యార్థులకు ఆహ్లాదకరమైన మరియు ప్రశాంతమైన వాతావరణం కల్పించాలని కలెక్టర్ సూచించారు. అటువంటి వాతావరణం విద్యార్థుల చదువుపై ఏకాగ్రత పెంచుతుందని పేర్కొన్నారు. పాఠశాలల్లో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని, వాటర్ హార్వెస్టింగ్ పిట్స్, కిచెన్ వేస్ట్ పిట్స్, కిచెన్ గార్డెన్ల ఏర్పాటుకు అనువైన స్థలాలను గుర్తించి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.
జిల్లాలోని అన్ని సంక్షేమ పాఠశాలలు, వసతి గృహాల్లో అందుబాటులో ఉన్న స్థలాన్ని వినియోగించి విస్తృతంగా మొక్కలు నాటాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కర్నూలు నేల, వాతావరణ పరిస్థితులకు అనుకూలమైన మొక్కలను ఎంపిక చేసి త్వరితగతిన నాటే కార్యక్రమాలు చేపట్టాలని నెట్ జీరో కోఆర్డినేటర్లకు సూచించారు.
ఈ సమావేశంలో డ్వామా పీడీ నరసింహారెడ్డి, జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి రాధిక, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి సురేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, కర్నూలు మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, అడిషనల్ కమిషనర్ కృష్ణ, డీపీవో భాస్కర్, నెట్ జీరో జిల్లా కోఆర్డినేటర్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ నిధుల అవినీతిపై సొమ్ము రికవరీ చేయాలి

## వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

**అనంతపురం సంక్షేమం జూన్ 16,(రిపబ్లిక్ న్యూస్):** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలపై బాధ్యుల నుంచి నిధులను వెంటనే రికవరీ చేసి, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం అనంతపురంలోని గణేనాయక్ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు కె. భాస్కర్ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025-26 సంవత్సరంలో జిల్లాలోని 31 మండలాల్లో నిర్వహించిన సామాజిక తనిఖీల్లో 1,535 కేసులు నమోదై రూ. 3.62 కోట్ల మేర అవినీతి జరిగినట్లు వెలుగులోకి వచ్చిందని తెలిపారు. అయితే ఇప్పటివరకు కేవలం రూ. 20 వేలే రికవరీ చేయడం బాధాకరమన్నారు. విడపనకల్ మండలంలో అవినీతి ఆరోపణలతో జైలుకు వెళ్లిన కంప్యూటర్ ఆపరేటర్‌ను మరో మండలంలో అదే హోదాలో నియమించడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిని విధుల నుంచి సస్పెండ్ చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టం పేదలకు వరంలాంటిదని, దాన్ని కొందరు వ్యక్తిగత ప్రయోజనాల కోసం వినియోగించుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో తీసుకొస్తున్న మార్పులను వ్యతిరేకిస్తూ జూలై 1న జిల్లా వ్యాప్తంగా గ్రామ సచివాలయాలు, ఎంపీడీవో కార్యాలయాల ఎదుట ధర్నాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ కూలీలు, వ్యవసాయ కార్మికులు, చిన్న, సన్నకారు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాధాకృష్ణ, హెచ్. తిమ్మయ్య, జిల్లా సహాయ కార్యదర్శి ఓబులేసు, నాగలింగమయ్య, జిల్లా కమిటీ సభ్యులు రామాంజనేయులు, చందు, బ్రహ్మయ్య, లక్ష్మీదేవి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.




# మిశ్రమ పంటల సాగుతో రైతులకు స్థిర ఆదాయం

**కలెక్టర్ డా. ఏ.సిరి**

**యూరియా కొరత లేకుండా సరఫరాపై ప్రత్యేక దృష్టి**

**పీఎమ్‌డీఎస్, పశుపోషణ, మేత పంటల సాగుకు ప్రోత్సాహం**

**లక్ష్యాల సాధనలో నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై చర్యలు**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 16)** కర్నూలు జిల్లాలో రైతుల ఆదాయం పెంపు, నేల సారవంతత పరిరక్షణ, పంటల వైవిధ్యీకరణ లక్ష్యాలతో మిశ్రమ పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖల పనితీరును సమీక్షించారు. ప్రతి రైతు ఒక ప్రధాన పంటతో పాటు ఐదు నుంచి ఆరు అనుబంధ పంటలను సాగు చేసేలా ప్రోత్సహించాలని, తక్కువ కాలంలో దిగుబడి ఇచ్చే మరియు కరువును తట్టుకునే పంటలను ఎంపిక చేయాలని సూచించారు. జిల్లాలో యూరియా కొరత లేకుండా రైతులకు సకాలంలో అందుబాటులో ఉంచాలని, పంపిణీలో లోపాలు తలెత్తితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పశుపోషణ ద్వారా అదనపు ఆదాయం పొందే అవకాశాలపై రైతులకు అవగాహన కల్పించాలని, ఈ ఏడాది జిల్లాలో 10 వేల పశు సంపద యూనిట్ల ఏర్పాటు లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. అలాగే 9,400 ఎకరాల్లో మేత పంటల సాగు, బీడు భూముల్లో ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేయాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని హైరిస్క్, మీడియం రిస్క్ ప్రాంతాలకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని, వాతావరణ మార్పులకు అనుకూలమైన పంటల సాగుపై రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. విజయవంతమైన మిశ్రమ పంటల నమూనాలను గుర్తించి ఇతర రైతులకు విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు.
సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, ఉద్యాన శాఖ అధికారి రాజాకృష్ణారెడ్డి, నేచురల్ ఫార్మింగ్ అధికారి మాధురి, మార్క్‌ఫెడ్ డీఎం రాజు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి కేసులో ఇద్దరు అరెస్టు

**వ్యాపార విభేదాలతో వ్యక్తిని ఇరికించే యత్నం**

**20 గ్రాముల గంజాయి, ద్విచక్ర వాహనం స్వాధీనం**

**అనంతపురం / గుత్తి క్రైమ్, జూన్ 16,( రిపబ్లిక్ న్యూస్ ):** గతంలో తనతో కలిసి వ్యాపారం చేసిన వ్యక్తిపై కక్షతో గంజాయి, నకిలీ నోట్ల కేసులో ఇరికించేందుకు ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులను గుత్తి పోలీసులు అరెస్టు చేశారు. పెద్దవడుగూరు మండలం గుత్తి అనంతపురం గ్రామానికి చెందిన చిలకల గోపాల్, దిమ్మగుడి గ్రామానికి చెందిన అప్పయ్యగారి బద్రి గతంలో తమతో కలిసి వ్యాపారం చేసిన చాకలి జీపల్లి రమేష్‌తో ఆర్థిక లావాదేవీలు, వ్యక్తిగత మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో ఎలాగైనా రమేష్‌ను గంజాయి, దొంగ నోట్ల కేసులో ఇరికించేందుకు ప్రయత్నించినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. గంజాయి, కరెన్సీ నోట్ల మాదిరిగా కత్తిరించిన నల్లని కాగితాలను కలిగి ఉన్న వ్యక్తుల గురించి అందిన సమాచారం మేరకు గుత్తి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రామారావు, ఎస్ఐ అమీర్ ఖాన్, పోలీసు సిబ్బంది, రెవెన్యూ అధికారులతో కలిసి సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. అందులో భాగంగా పట్టణంలోని దుర్గా శివ పెట్రోల్ బంక్ సమీపంలోని గుత్తిఅనంతపురం రోడ్డు క్రాస్ వద్ద మధ్యాహ్నం 3 గంటల సమయంలో నిందితులను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 20 గ్రాముల గంజాయి, కరెన్సీ నోట్ల ఆకారంలో కత్తిరించిన నల్లని కాగితాలతో పట్టుబడ్డారు. దీంతో నిందితులను అరెస్టు చేసి గంజాయి, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కేసుకు సంబంధించి మరిన్ని వివరాలపై దర్యాప్తు కొనసాగుతోందన్నారు.



# జూన్ 17న టెక్కే మార్కెట్ యార్డులో ఘనంగా "రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమం





**నంద్యాల బ్యూరో, జూన్ 16 (రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న "రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం నిర్వహించనున్న జిల్లా స్థాయి కార్యక్రమానికి సంబంధించి మంగళవారం నంద్యాల పట్టణంలోని టెక్కే మార్కెట్ యార్డులో ఏర్పాట్లను మంత్రి, కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ప్రధాన వేదిక, ఎగ్జిబిషన్ స్టాళ్లు, పార్కింగ్ ప్రదేశాలు, పందిళ్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ సదుపాయాలు తదితర ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధి,



సంక్షేమ విజయాలను ప్రజలకు చేరవేసే వేదికగా ఈ కార్యక్రమం నిలవనున్నందున అన్ని ఏర్పాట్లు అత్యున్నత ప్రమాణాలతో ఉండాలని సూచించారు. కార్యక్రమానికి సుమారు ఐదు వేల మంది ప్రజలు హాజరుకానున్న నేపథ్యంలో వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న శాఖల స్టాళ్లు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రభావాన్ని, అభివృద్ధి కార్యక్రమాల ఫలితాలను స్పష్టంగా ప్రతిబింబించేలా ఉండాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. మొత్తం 19 శాఖలు తమ తమ విభాగాల సేవలు, విజయాలు, వినూత్న కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. పంచాయతీరాజ్, ఆర్టీసీ, డీఆర్డీఏ, వ్యవసాయ, మెప్మా, పశుసంవర్ధక, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్, పర్యాటక, ఆర్‌డబ్ల్యూఎస్, శానిటేషన్, పోలీసు, మత్స్యశాఖలతో పాటు ఇతర విభాగాలు కూడా తమ శాఖల పనితీరును ప్రజలకు చేరవేసేలా ఆకర్షణీయమైన స్టాళ్లను సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. అంతకుముందు జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ కార్యక్రమ స్థలాన్ని సందర్శించి ఏర్పాట్ల పురోగతిని సమీక్షించారు. నిర్ణీత గడువులోగా అన్ని పనులను పూర్తి చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# విచారణ ముగిసింది

## చర్యలకు సిద్ధమవుతున్న అధికారులు.



**రైల్వే కోడూరు జూన్ 16 రిపబ్లిక్ న్యూస్.** ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మంగంపేట ఏపీ ఎం డి సి సంస్థ నుంచి కేంద్ర ప్రభుత్వ సంస్థలైన ఓఎన్జిసి కంపెనీకి సరఫరా చేసిన. ముగ్గురా యజమానులు తో ఏపీఎండిసి ఈడి.కేదార్నాథ్ రెడ్డి సోమవారం మంగంపేట ఏపీఎండిసి కార్యాలయంలో సమావేశమై వారితో ముగ్గురాయి సరఫరా విధివిధానాలపై చర్చించడం జరిగింది ఇటీవల వార్తాపత్రికలలో ఓఎన్జిసికి ఎగుమతి చేసిన ముగ్గురాయి నాసిరకం తదితర ఆరోపణలపై ఏపీఎండిసి అధికారులు స్పందించి మీల్లుల యజమానుల వద్ద ఉన్న డేటా ముగ్గురాయి రికార్డులు ఎన్ని టన్నులు సరఫరా చేశారు ఏ గ్రేడ్. బి గ్రేడ్. మరియు సీ అండ్ డి గ్రేడులకు సంబంధించిన ముగ్గురాయి పూర్తి వివరాలను బుధవారం రెండవ రోజు పేపర్ వర్క్ ద్వారా అధికారులకు సమర్పించాలని సూచించారు. అంతేకాకుండా గనులలో పర్యటించి ఏ గ్రేడ్ బి గ్రేడ్, ఖనిజా ఉత్పత్తులు మరియు స్టాక్ పెయింట్లో ఎంత ముగ్గురాయి ఖనిజం ఉందని పరిశీలించడం జరిగిందని అధికారులు తెలిపారు పూర్తి వివరాలు సేకరించి విచారణ చేపట్టి డేటాను తీసుకున్నామన్నారు ఇప్పటికి విచారణ పూర్తయిందని తప్పు తడకలు పూర్తి వివరాలు పరిశీలించి నివేదికలు బయటికి తెలుపుతామని అలాగే పై అధికారులకు నివేదిక సమర్పిస్తామని అన్నారు. మరి కొంతమంది తూతూ మంత్రంగా ఎంక్వైరీ లు చేస్తారా లేక గ్రేడుల్లో గందరగోళం మరియు నాసిరకం ముగ్గురాయి వాడకంపై చర్యలు తీసుకుంటారా లేదా అని వేచి చూడాల్సి ఉందని. పలువురు ప్రజలు మంగంపేట కార్మిక నాయకులు బిజెపి నాయకులు కూటమి నాయకులు మరియు ఆర్థిక విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు అవకతవకలో వెలికి తీసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆల సంఘాల నాయకులు కోరుతున్నారు.

# గొర్రెల కాపరిపై దుండగుల దాడి

## తండ్రిని కాపాడబోయిన కుమారుడిపైనా దుండగుల దాడి

## తండ్రికొడుకుల పరిస్థితి విషమం





**అనంతపురం/శింగనమల క్రైమ్, జూన్ 16,(రిపబ్లిక్ న్యూస్):** గొర్రెల కాపరిపై దుండగులు విచక్షణారహితంగా దాడి చేశారు. కళ్ళ ముందరే తండ్రిని కొడుతున్న దృశ్యాన్ని చూడలేక కాపాడబోయేందుకు వెళ్లిన కుమారుడు పైన దుండగులు దాడి చేయడంతో తీవ్ర గాయాల పాలయ్యారు. మంగళవారం శింగనమల నియోజకవర్గంలోని బుక్కరాయసముద్రం మండలం సంజీవపురంలో గొర్రెల కాపరిగా జీవనం సాగిస్తున్న వ్యక్తిపై కొందరు వ్యక్తులు మూకుమ్మడిగా దాడికి పాల్పడ్డారు. ఈ అమానుష ఘటన మండలంలో తీవ్ర కలకలం రేపింది. తండ్రిపై జరుగుతున్న దాడిని అడ్డుకునేందుకు వచ్చిన కుమారుడిపైనా అదే రీతిలో దాడి చేయడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లారు. వెంటనే వీరిని మెరుగైన చికిత్స కోసంఅనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. సర్వజన ఆసుపత్రిలో వీరు చికిత్స పొందుతున్నారు. స్థానికుల కథనం ప్రకారం ..... సంజీవపురానికి చెందిన బాధితుడు జీవనోపాధి కోసం గొర్రెలు మేపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మంగళవారం గ్రామ శివారులో ఉండగా కొందరు వ్యక్తులు అతనితో వాగ్వాదానికి దిగినట్టు తెలిసింది. మాటామాటా పెరగడంతో దుండగులు ఒక్కసారిగా కర్రలు, ఇతర వస్తువులతో దాడికి పాల్పడ్డారు. దాడిని గమనించిన బాధితుడి కుమారుడు అక్కడికి చేరుకుని తండ్రిని కాపాడే ప్రయత్నం చేశాడు. అయితే ఆగ్రహంతో ఊగిపోయిన దుండగులు కుమారుడిపై కూడా విచక్షణారహితంగా దాడి చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. దాడిలో తండ్రికొడుకులకు తల, శరీరంలోని పలు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. రక్తపు మడుగులో పడి ఉన్న వారిని గమనించిన స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం గ్రామస్థుల సహకారంతో ఇద్దరినీ మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దాడికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గొర్రెల కాపరిగా జీవనం సాగించే నిరుపేద కుటుంబంపై జరిగిన ఈ దాడి స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయం నందు నెలవారి నేర సమీక్ష సమావేశం

**నంద్యాల క్రైం, జూన్ 16, (రిపబ్లిక్ న్యూస్):** నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో అన్నీ సబ్ డివిజన్ల పోలీసు అధికారులతో జిల్లా ఎస్పీ మంగళవారం నెలవారి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం నందు పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసులు వాటి స్థితిగతులు, నమోదైన కేసుల్లో నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తు తీరుతెన్నులు వాటి పురోగతిపై సంబంధిత పోలీస్ అధికారులతో ఆరా తీసి కేసుల ఫైల్స్ ను క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్ స్టేషన్ల వారీగా యు.ఐ కేసులు తగ్గించుకోవాలన్నారు. నిర్ణీత గడువులోపు పెండింగ్ కేసులను పరిష్కార దశకు తీసుకురావాలన్నారు.

హత్యలు, హత్యాయత్నాలు,క్రైమ్ అగైనెస్ట్ ఉమన్, ప్రాపర్టీ కేసులు, రోడ్డు ప్రమాదాలు తదితర కేసులను సమీక్ష చేశారు. నమోదైన కేసులలో సమగ్ర దర్యాప్తు నిర్వహించి నేరస్తులు తప్పించుకునే వీలు లేకుండా న్యాయ స్థానాలలో తగిన సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టి నేరస్తులకు శిక్ష పడే విధంగా అన్నీ ఆదారాలు సేకరించి చార్జిషీట్ ధాకాలు చేయాలన్నారు. పోలీసు స్టేషన్లలో నమోదయ్యే కేసుల వివరాలను సీసీటీఎన్ఎస్ లో ఎప్పటికప్పుడు పొందుపరచాలని తెలిపారు. ఆయా కేసుల ఛేదింపునకు, పరిష్కారానికి, నేర నియంత్రణకు దోహదం చేసే పలు సూచనలు, మెళకువలను అధికారులకు తెలియజేశారు. హత్య కేసుల, పోక్సో కేసులు, కేసులలో దర్యాప్తు వేగాన్ని పెంచాలని, హత్య, ఇతర కీలకమైన కేసుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని దర్యాప్తు సమగ్రంగా





చేపట్టాలన్నారు. ప్రాపర్టీ నేరాల్లో నిందితులను త్వరగా పట్టుకొని దొంగిలించిన సొత్తును రికవరీ చేయాలన్నారు. దొంగతనాలు, దోపిడీలు, తదితర నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని ముఖ్యమైన ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలకు వాటి ప్రాముఖ్యతను వివరిస్తూ కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. దొంగతనాలను అరికట్టేందుకు హైవే రహదారులపై వాహనాల తనిఖీలు చేస్తూ ప్రత్యేక చొరవ చూపాలని ,అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వేలి ముద్రలను తనిఖీ చేయాలి. ఏపీకే ఫైల్ ,లోన్ యాప్ ల మోసాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి చైతన్యం చేయాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలైన మట్కా, పేకాట, అక్రమ మద్యం రవాణాపై ముందస్తు సమాచారం సేకరించి వీటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి వంటి నిషేధిత మాదకద్రవ్యాలను రవాణా, విక్రయించే వారిపై ఎన్డిపిఎస్ కేసులు నమోదు చేయాలన్నారు.గంజాయి రవాణా పై ప్రత్యేక దృష్టి సారించి ఎన్డిపిఎస్ కేసులను డీఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షించాలి.అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి అధికారులు ఎప్పటికప్పుడు మారుతున్న చట్టాలకు అనుగుణంగా అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించుకుని ప్రతి పోలీసు అధికారి బాధ్యతగా వ్యవహరించాలి పూర్తిస్థాయిలో విచారణ దర్యాప్తు చేసి ఖచ్చితమైన ఆధారాలతో కోర్టుకు సమర్పించి బాధితులకు సరైన న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమమలో అడిషనల్ ఎస్పీ యగంధర్ బాబు, నంద్యాల సబ్ డివిజన్ ఎస్పీ ఎం.జావళి, డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, రామాంజి నాయక్, శ్రీనివాస్, శ్రీనివాసులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# మాతృ శిశు మరణాలు అరికడదాం

## జిల్లా వైద్యాధికారి డా. ఈబి దేవి

**అనంతపురం వైద్యం, జూన్ 16,(రిపబ్లిక్ న్యూస్):** జిల్లాలో మాతృ మరణాలు, శిశు మరణాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ఈ.బి. దేవి గారి ఆధ్వర్యంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో నమోదైన 6 శిశు మరణాలకు సంబంధించిన కేసులను క్షుణ్ణంగా సమీక్షించారు. ప్రతి మరణానికి గల కారణాలను విశ్లేషించి, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన నివారణ చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు.

**నవజాత శిశువులకు అవసరమైన వైద్య సేవలు**

ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి ఈ.బి దేవి మాట్లాడుతూగర్భిణీ స్త్రీలకు ప్రారంభ దశ నుంచే



నాణ్యమైన ప్రసూతి పూర్వ సేవలు అందించడంలో క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అధిక ప్రమాద గర్భిణీలను సకాలంలో గుర్తించి ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచాలని ఆదేశించారు. ఆసుపత్రి ప్రసవాలను ప్రోత్సహించడం, నవజాత శిశువులకు అవసరమైన వైద్య సేవలు అందించడం, ఆరు నెలల వరకు బిడ్డకు కేవలం తల్లిపాలు మాత్రమే త్రాగించాలని శిశువుల ఆరోగ్య పరిస్థితిపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అదే విధంగా కాన్పుకు కాన్పుకు మధ్య దూరం పాటించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి గర్భిణీలు, బాలింతలు, శిశువులకు అందుబాటులో ఉన్న ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే మాతృ, శిశు మరణాల నివారణకు శాఖల మధ్య సమన్వయంతో పనిచేసి జిల్లాలో మాతృ, శిశు మరణాల రేటును తగ్గించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో వ్యాధి నిరోధక టీకాల అధికారి డా. ప్రసన్న భారతి, ప్రోగ్రాం అధికారులు డా. శ్రీనివాసుల రెడ్డి, డా.గంగాధర్ రెడ్డి మరియు డా.సునీత, డా.అరుణ, డిపిహెచ్ఎన్ఓ ప్రమీల, హేమలత మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# హోంమంత్రి అనితపై గుడివాడ కామెంట్స్

## దిగజారిపోయి మహిళలపై విమర్శలు సరికాదు

## ఇది యావత్తు మహిళా లోకానికే అవమానం

## అమరన్‌నాథ్ వ్యాఖ్యలపై మండిపడ్డ డిప్యూటి సిఎం



**అమరావతి, జూన్ 16 రిపబ్లిక్ న్యూస్** రాజకీయాల్లో విమర్శలు విధానపరంగానే ఉండాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. రాష్ట్ర హోంశాఖ మంత్రి అనితపై ఓ మాజీ మంత్రి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మహిళల కట్టుబొట్టుపై కామెంట్స్ చేసే స్థాయికి ఆ నాయకుడి పార్టీవారు దిగజారిపోయారంటూ వ్యాఖ్యానించారు. స్త్రీల గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఆ వ్యాఖ్యలు కేవలం హోం మంత్రిని అన్నట్టే కాదని.. సగటు మహిళలందరినీ కించపరచినట్లే అని పవన్ అన్నారు. ప్రజా జీవితంలో ఉన్నవారి నోటి నుంచి వచ్చే ప్రతి మాటను పౌర సమాజం గమనిస్తోందనే విషయాన్ని మరచిపోవద్దని పవన్ అన్నారు. రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు ఉంటాయని... అవి విధానపరంగానే ఉండాలన్నారు. ఒక పాలసీ నచ్చకపోతే ఆ పాలసీ విషయంపైనే విమర్శించాలన్నారు. వాచలత్వంతో ఇళ్లలోని స్త్రీలను కూడా కించపరచే నైజం ఉన్న పార్టీ చేసే కామెంట్స్‌లను బలంగా తిప్పికొట్టేటప్పుడు వాళు చేస్తున్న వ్యాఖ్యల్లో ఎంతటి అభ్యంతరకరమైన విషయం ఉందో ప్రజలకు తెలియజెప్పాలని కూటమి నేతలకు సూచించారు. కూటమి నేతలందరూ పౌర సమాజం హర్షించే భాషలో మాట్లాడి బలంగా బదులివ్వాలన్నారు. అవతలి పార్టీవాళ్ల మాదిరి దిగజారుడు భాష, అర్థరహిత వ్యాఖ్యలు కూటమి నేతలకు అవసరం లేదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

------

# రైతులకు వేరుశనగ విత్తనాల పంపిణీ

**అనంతపురం/ గుత్తి జూన్ 16 (రిపబ్లిక్ న్యూస్)** గుత్తి మండలం జక్కలచెరువు గ్రామంలో రైతులకు వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే తనయుడు పామిడి, గుత్తి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా గుమ్మనూరు ఈశ్వర్ సంబంధిత గ్రామ రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్ ప్రారంభం సందర్భంగా రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ చేయడం సంతోషకరమని తెలిపారు. ప్రభుత్వం తరపున 40% సబ్సిడీతో



విత్తనాలు అందజేస్తున్నారని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆత్మనిర్భరత మిషన్ కింద కందుల విత్తనాలు కూడా రైతులకు పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రైతులకు అండగా ఉండి వారిని ఆదుకునే ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది కూటమి ప్రభుత్వమేనని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాత్రమే రైతుల కోసం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ సూర్య ప్రతాప్, పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి, మండల అధ్యక్షుడు లక్ష్మి రంగయ్య, ఎంపీటీసీ నారాయణస్వామి,వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ శ్రీనివాసులు, శివశంకర్, నాగేంద్ర, రసూల్, అధికారులు గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# టీ వై జె ఎఫ్ విజయం

**జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అందించాలంటూ విద్యాశాఖ ఆదేశాలు.**

**జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్ రోహిణి.**

**టీ వై జె ఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహబూబ్.**

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 16 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**




తెలంగాణ యూత్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ టి వై జె ఎఫ్ నిరంతర కృషి ఫలితంగా సంగారెడ్డి జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అందించే దిశగా కీలక ముందడుగు పడింది. వివిధ జర్నలిస్టు సంఘాల వినతుల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్. రోహిణి జిల్లాలోని ప్రైవేట్ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాలకు ప్రత్యేక లేఖ జారీ చేశారు.

జర్నలిస్టుల పిల్లలకు సాధ్యమైనంత మేర ఉచిత విద్య అందించాలని పాఠశాలల కరస్పాండెంట్లు, యాజమాన్యాలను కోరారు. జర్నలిస్టు సమాజానికి ప్రోత్సాహకంగా ఈ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా టి వై జె ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ తనుగుల జితేందర్ రావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహబూబ్, విద్యాశాఖకు కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం టీ వై జె ఎఫ్ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని వారు పేర్కొన్నారు. జిల్లాలోని అర్హులైన జర్నలిస్టులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని టి వై జె ఎఫ్ నాయకులు కోరారు.

# వైద్య ఆరోగ్య రంగంలో సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు

**తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నూతన రాష్ట్ర కార్యదర్శిగా ఎం, యాదగిరి ఎన్నిక**

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 16( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**



వైద్య ఆరోగ్య రంగ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటాలు చేయనున్నట్లు తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రకటించింది. హైదరాబాద్లోని యూనియన్ కార్యాలయంలో రాష్ట్ర జనరల్ బాడీ సమావే శంలో నూతనంగా రాష్ట్ర కార్యదర్శిగా ఎం యాదగిరి ని ఏకగ్రీవ ఎన్నుకోవడం జరిగింది

ఈ సందర్భంగా మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం యాదగిరి మాట్లాడుతూ.. బడ్జెట్లో వైద్య రంగానికి నిధులు పెంచాలని, ఖాళీ పోస్టులను శాశ్వత ప్రాతి పదికన భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రా క్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, 104 ఉద్యోగుల 15 నెలల పెండింగ్ వేతనాల విడుదల, 51% ఫిట్మెంట్ తో 2వ పీఆర్సీ అమలు చేయాలి పెండింగ్లో ఉన్న 6 డీఏలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

# రైతులకు వేరుశనగ విత్తనాల పంపిణీ




**అనంతపురం/ గుత్తి జూన్ 16 (రిపబ్లిక్ న్యూస్)**

గుత్తి మండలం జక్కలచెరువు గ్రామంలో రైతులకు వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే తనయుడు పామిడి, గుత్తి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గుమ్మనూరు ఈశ్వర్ సంబంధిత గ్రామ రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్ ప్రారంభం సందర్భంగా రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ చేయడం సంతోషకరమని తెలిపారు. ప్రభుత్వం తరపున 40% సబ్సిడీతో విత్తనాలు అందజేస్తున్నారని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆత్మనిర్భరత మిషన్ కింద కందుల విత్తనాలు కూడా రైతులకు పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రైతులకు అండగా ఉండి వారిని ఆదుకునే ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది కూటమి ప్రభుత్వమేనని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాత్రమే రైతుల కోసం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ సూర్య ప్రతాప్, పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి, మండల అధ్యక్షుడు లక్ష్మి రంగయ్య, ఎంపీటీసీ నారాయణస్వామి,వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ శ్రీనివాసులు, శివశంకర్, నాగేంద్ర, రసూల్, అధికారులు గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డు అందుకున్న

## ( మాల మహానాడు అధ్యక్షుడు పాల్వంచ రాజీవ్ గాంధీ )

**హత్నూర:16 జూన్ 26( రిపబ్లిక్ న్యూస్)**




సంగారెడ్డి జిల్లా, హత్నూర మండలం, కొన్యాల, గ్రామానికి దక్కిన గౌరవం స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా ఎన్జీవో ఫౌండేషన్ మరియు చైర్మన్ లయన్ డాక్టర్: ఆకుల రమేష్ ఆధ్వర్యంలో ఈరోజు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డు అందుకోవడం చాలా సంతోషం గా ఉందని అన్నారు తాను మాట్లాడుతూ మండలంలోని దళిత సామాజిక వర్గంలో ఉన్న యువత బాబాసాహెబ్ అంబేద్కర్ గారి ఆశయాలను ప్రతి ఒక్కరూ పాటించాల్సిన అవసరం ఉందని అన్నారు అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని విద్య పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ పెట్టాలని విద్యార్థులకు తెలియజేశారు, భవిష్యత్తులో అంబేద్కర్ గారు స్ఫూర్తితో ముందుకు వెళ్తానని తెలియజేశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

# ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐ ర్ ) విజయవంతానికి బీఎల్ఓల పాత్ర కీలకం

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

**మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 16( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**



ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో లో భాగంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారుల పాత్ర (బీఎల్ఓలు) కీలకం అని వివరించారు. జూన్ 25 నుంచి ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐ ర్ స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ ) ప్రక్రియ ప్రారంభం కానుందన్నారు. మరణించిన వారిని, శాశ్వతంగా వలస వెళ్లిన వారిని, డూప్లికేట్ ఓట్లను తొలగించి పారదర్శకమైన ఓటర్ల జాబితాను రూపొందించడమే ఈ సర్వే ముఖ్య ఉద్దేశమన్నారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు నిర్వహించనున్న ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ప్రతి బీఎల్ఓ తమ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించాలని కలెక్టర్ సూచించారు. భారత ఎన్నికల సంఘం జారీ చేసిన డిక్లరేషన్ ఫారాలను ప్రతి ఓటరుకు అందజేసి, వాటి స్వీకరణకు సంబంధించిన అంగీకార పత్రాన్ని (అక్నాలెడ్జ్మెంట్) తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు. అర్హులైన ప్రతి ఓటరు వివరాలు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఏ ఒక్క అర్హుడి ఓటు తొలగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూ, ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు (బి ఎల్ ఓ ఎస్ ) ఇంటింటికీ తిరిగి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసి, ఓటర్ల వివరాలను సేకరిస్తారన్నారు.

సేకరించిన సమాచారం ఆధారంగా జూలై 31న ముసాయిదా (డ్రాఫ్ట్ ) ఓటర్ల జాబితాను అధికారులు ప్రదర్శిస్తారన్నారు.

జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు, పేర్ల తొలగింపు (లేదా) సవరణలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

అక్టోబర్ 1, 2026 నాటికి ఓటర్ల తుది జాబితా ప్రకటన ఉంటుందన్నారు.

డివిజన్, ఏఈఆర్ఓ స్థాయిలలో కూడా శిక్షణ తరగతులు నిర్వహించాలని, ఎస్ఐఆర్ లో ఉన్న అన్ని మాడ్యూల్స్ పై బీఎల్ఓలు అవగాహన కలిగి ఉండాలన్నారు. చాలా జాగ్రత్తగా ఎక్కడ కూడా తప్పు జరగకుండా ఈ ప్రక్రియను చేపట్టాలని,

ఈ ప్రక్రియపై విస్తృత ప్రచారం కల్పించాలని, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు.

# బహుజన్ సమాజ్ పార్టీ కరీంనగర్ అదిలాబాద్ జోన్ ఇన్చార్జిల నియామకం

**కరీంనగర్ ప్రతినిధి జూన్ 16**

**( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**






పల్లె ప్రశాంత్ గౌడ్



దొడ్డే శ్రీనివాస్ పార్లమెంట్ ఇంచార్జి




బోయిని బాబు పార్లమెంట్ ఇంచార్జి

కరీంనగర్:- బహుజన్ సమాజ్ పార్టీ లో సుదీర్ఘ అనుభవం ఉన్న నాయకుడు కల్లెపెల్లి రాజేందర్ ని అదిలాబాద్ జోన్ -1 ఇంచార్జ్ గా బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్ ప్రకటించారు అతనితో పాటు మరోక ఇంచార్జ్ గా పల్లె ప్రశాంత్ గౌడ్ ని ప్రకటించారు. అదేవిధంగా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం ఇంచార్జ్ లు గా దొడ్డే శ్రీనివాస్ బోయిని బాబు లను ప్రకటించారు. నిన్న రాష్ట్ర కార్యాలయం లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బీఎస్పీ ఛీఫ్ సెక్టార్ కో ఆర్డినేటర్ మాజీ ఎమ్మెల్సీ అతర్ సింగ్ రావు సురేష్ ఆర్య ల ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షుడు ఈ పదవి భాధ్యత లు ఇచ్చారు. అదిలాబాద్ జోన్ పరిది లో నాలుగు పార్లమెంటు స్థానాలు ఉన్నాయి ఇరవై ఎనమిది అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి . రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు ఆదేశించారు.

కల్లెపెల్లి రాజేందర్ చొప్పదండి అసెంబ్లీ రామడుగు మండలం వెలిచాల గ్రామానికి చెందిన వ్యక్తి . పూలే అంబేద్కర్ సిద్ధాంతాలకు ప్రభావితుడై గత 35 సంవత్సరాలుగా బీఎస్పీ లో పని చేస్తున్నారు. ఆయన సీనియారిటీ సిన్సియారిటీ నిబద్ధత ను పార్టీ పరిగణలోకి తీసుకొని ఈ బాధ్యతలు ఆయనకు ఇచ్చారు.

ఒబిసి సమీకరణ లో భాగంగా పల్లె ప్రశాంత్ గౌడ్ కి అవకాశం ఇచ్చారు. ఈయన గత శాసన సభ ఎన్నికల్లో హుజురాబాద్ నుండి పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు.

పార్లమెంటు ఇంచార్జ్ లు గా నియమితులైన దొడ్డే శ్రీనివాస్ జమ్మికుంట మండలం పెద్దంపెల్లి మాజీ సర్పంచ్ గా పని చేశారు. పార్టీ లో సగం పదవులు యువత కి ఇవ్వాలని జాతీయ అధ్యక్షురాలు బెహన్ జీ గారీ ఆదేశాల ప్రకారం వీరికి ఈ పదవులు దక్కాయి.

ఈ నియామకం కి సహకరించిన బీఎస్పీ ఛీఫ్ జోన్ ఇంచార్జ్ అడ్వకేట్ నిషాని రామచంద్రం రాష్ట్ర కార్యవర్గ సబ్యులు మాతంగి అశోక్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఆదాయానికి మించిన ఆస్తులు

**ల్యాండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ నరహరి ఇంట్లో ఎసిబి సోదాలు -భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు గుర్తింపు**

**హైదరాబాద్,జూన్ 16 రిపబ్లిక్ న్యూస్**



ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే పక్కా సమాచారంతో ల్యాండ్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ నరహరి ఇంట్లో ఎసిబి అధికారులు మంగళవారం ఉదయం నుంచి విస్తృత తనిఖీలు చేపట్టారు. నగరంలోని నరహరి నివాసంతో పాటు ఆయనకు సంబంధించిన ఆఫీసులు, బంధువులు, అత్యంత ఆప్తుల ఇళ్లలో ఎసిబి బృందాలు ఏకకాలంలో సోదాలు చేపట్టారు. హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లోని దాదాపు 10 విభిన్న ప్రాంతాలలో ఈ దాడులు కొనసాగుతున్నాయి. నరహరి తన అధికారిక ఆదాయానికి మించి భారీగా అక్రమ ఆస్తులను కూడబెట్టారనే ఆరోపణలపై ఎసిబి ఈ చర్యలు చేపట్టింది. ఈ తనిఖీల్లో కీలకమైన భూమి పత్రాలు, బ్యాంక్ ఖాతాల వివరాలు, నగదు, బంగారు ఆభరణాలకు సంబంధించిన డాక్యుమెంట్లను అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ దాడులు ఇంకా కొనసాగుతున్నాయి. సోదాలు ముగిసిన తర్వాత పట్టుబడిన అక్రమ ఆస్తుల పూర్తి వివరాలను, వాటి మార్కెట్ విలువను ఏసీబీ అధికారులు అధికారికంగా వెల్లడించే అవకాశం ఉంది. ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో 13 చోట్ల సోదాలు జరుగుతున్నాయి. ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయనే ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ సోదాలు నిర్వహిస్తోంది. చార్మినార్తో సహా పలు ప్రాంతాల్లో తనిఖీలు జరుగుతున్నాయి. సోదాల్లో భాగంగా భారీగా అక్రమాస్తులను ఏసీబీ అధికారులు గుర్తించారు. ల్యాండ్ డాక్యుమెంట్లు, బంగారు ఆభరణాలతో పాటు రూ.1.10 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. నరహరితో పాటు ఆయన తమ్ముడి నివాసంలో సోదాలు కొనసాగుతున్నాయి. తమ్ముడి ఇంట్లోనూ భారీగా ఆస్తులను అధికారులు గుర్తించారు. ఇప్పటికే స్వాధీనం చేసుకున్న ఆస్తుల వివరాలపై అన్నదమ్ముల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. ల్యాండ్ అండ్ సర్వే డిపార్ట్మెంట్లో మల్టీ జోన్ 2 డిప్యూటీ డైరెక్టర్గా నరహరి కీలక విధులు నిర్వహిస్తున్నారు. భూమి సర్వే, సరిహద్దు వివాదాల పరిష్కారం, భూమి స్వాధీనం వంటి కీలక ఉద్యోగ బాధ్యతలను ఆయన నిర్వర్తిస్తున్నారు. గతంలో రంగారెడ్డి జిల్లాకి ఏడీగా కొంకరి నరహరి పనిచేశారు. దీంతో ఆ సమయంలో కూడా భారీగా అక్రమాలకు పాల్పడినట్టు ఏసీబీ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

# అన్నలు లేరని అలుసు తీసుకుంటే ఖబర్దార్

**ఇప్పుడు వారంతా మా పార్టీలోనే ఉన్నారు**

**సింగరేణిలో అక్రమాలను నిలదీస్తూనే ఉంటాం**

**బొగ్గుబాయి బాటలో కవిత వెల్లడి**

**మంచిర్యాలజూన్ 16 రిపబ్లిక్ న్యూస్**




తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత తలపెట్టిన భూగర్భగని వద్ద 'బొగ్గుబాయి' కార్యక్రమంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 7 గని ఆవరణలోకి వెళ్లేందుకు ప్రయత్నించిన కవిత, టీఆర్ఎస్ శ్రేణులు, కార్మికసంఘం నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. గేట్లను తోసుకొని కవిత, పార్టీ శ్రేణులు గని ఆవరణలోకి దూసుకెళ్లారు. 'బొగ్గు బాయి' కార్యక్రమంలో తమను అడుగడుగునా సింగరేణి యాజమాన్యం అడ్డుకుంటుందని, కార్మికులతో కలిసి గేట్ మీటింగ్ పెట్టుకునే హక్కు తమకు ఉందని ఈ సందర్భంగా కవిత అన్నారు. సింగరేణి యాజమాన్యం కార్మికులకు కనీసం తాగునీటి సౌకర్యం కూడా కల్పించకుండా మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతోందని ఆరోపించారు. అడవిలో అన్నలు లేరని సింగరేణి యాజమాన్యం కార్మికులను వేధిస్తోందన్నారు. అన్నలు తమ పార్టీలో కూడా ఉన్నారన్నారు. కార్మికులకు ఇబ్బంది కలిగేలా వ్యవహరిస్తే.. ఊరుకునే ప్రసక్తే లేదని, అవసరమైతే న్యాయపరంగా ముందుకెళ్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం కురిపించారు. కవిత మాట్లాడుతూ.. 'గతంలో రాహుల్, రేవంత్, భట్టి సింగరేణిలో పర్యటించలేదా? కార్మికుల సమస్యలు తెలుసుకుంటే తప్పేంటి?. పోలీసులను పెట్టుకుని ఎన్నిరోజులు అధికారంలో ఉంటారు?. కార్మికుల సమస్యలపై టీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుంది' అని అన్నారు. ఈ సందర్భంగా మావోయిస్టులపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అడవిలో అన్నలు ఉంటే.. అప్పట్లో ఇక్కడ ధైర్యం ఉండేది. సింగరేణి అధికారులు పద్ధతిగా పనిచేసేవారు. అడవిలో అన్నలు లేరని, అడిగే దిక్కులేదని.. సింగరేణి యాజమాన్యం అనుకుంటోంది. కానీ, అడవిలో అన్నలందరూ ఇప్పుడు టీఆర్ఎస్లోనే ఉన్నారు. కార్మికుల హక్కులకు భంగం కలిగిస్తే వెంటాడుతాం అని అన్నారు.



## సూర్యతో నెల్సన్ మూవీకి ప్లాన్

నటుడు సూర్య 50వ చిత్రానికి 'జైలర్' దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహిస్తారా? అనేది కోలీవుడ్‌లో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం నెల్సన్, రజనీకాంత్‌తో 'జైలర్ 2' పనుల్లో బిజీగా ఉన్నారు. అయితే 'సూర్య 50' కోసం వీరిద్దరూ కలిసి పని చేయనున్నట్లు సమాచారం. ఈ మైలురాయి చిత్రాన్ని ఫుల్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తీయాలని ప్లాన్. ఈ ప్రాజెక్ట్‌ను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించే అవకాశం ఉందని, దీనికి అనిరుధ్ సంగీతం అందిస్తారని టాక్. నెల్సన్ కామెడీ స్టైల్‌కి, సూర్య ఎనర్జీ తోడైతే థియేటర్లలో నవ్వులే నవ్వులని ఫ్యాన్స్ అంచనా. నెల్సన్ ప్రస్తుతం 'జైలర్ 2' ప్రీ-ప్రొడక్షన్ పనుల్లో ఉన్నారు. దీంతో 'సూర్య 50' సెట్స్ పైకి వెళ్లేందుకు ఇంకా టైమ్ పడుతుంది. అయితే దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. నెల్సన్-సూర్య కాంబో కుదిరితే తెలుగు, తమిళ ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొంటాయి.

# విశ్వంభర విడుదల తేదీపై సందిగ్ధత

### అధికారికంగా ప్రకటించని మేకర్స్




మెగాస్టార్ చిరంజీవి హీరోగా తెరకెక్కుతున్న భారీ సోషియో-ఫాంటసీ సైన్స్ ఫిక్షన్ చిత్రం 'విశ్వంభర' కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే సినిమా విడుదల తేదీ విషయంలో కొనసాగుతున్న అనిశ్చితి మెగా ఫ్యాన్స్‌ను తీవ్ర నిరాశకు గురి చేస్తోంది. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన ఈ చిత్రం ఎప్పుడు ప్రేక్షకుల ముందుకు వస్తుందనే అంశంపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. వశిష్ట దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌పై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. మెగాస్టార్‌ను మరోసారి ఫాంటసీ ప్రపంచంలో చూడబోతున్నామని అభిమానులు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. అయితే షూటింగ్ పూర్తయినప్పటికీ విడుదల తేదీపై ఇంకా స్పష్టత లేకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. మొదట ఈ చిత్రాన్ని జూలైలో విడుదల చేసే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరిగింది. ఆ తర్వాత ఆగస్టు రిలీజ్‌పై కూడా వార్తలు వినిపించాయి. కానీ చిత్ర నిర్మాణ సంస్థ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోవడంతో ఆ వార్తలన్నీ కేవలం ఊహాగానాలు గానే మిగిలిపోయాయి. తాజా సినీ వర్గాల సమాచారం ప్రకారం, 'విశ్వంభర'ను ఈ ఏడాది దసరా కానుకగా విడుదల చేయాలనే ఆలోచనలో నిర్మాతలు ఉన్నట్లు తెలుస్తోంది. దసరా సీజన్‌కు భారీ చిత్రాలకు మంచి మార్కెట్ ఉండటంతో ఈ పండుగను లక్ష్యంగా పెట్టుకున్నారని టాక్ వినిపిస్తోంది.దీనికి ప్రధాన కారణం రాబోయే నెలల్లో టాలీవుడ్‌లో భారీ చిత్రాలు క్యూ కడుతుండడం. డిసెంబర్ నుంచి వరుస స్టార్ హీరోల సినిమాలు విడుదలకు సిద్ధమవుతున్నాయి. అలాగే 2027 సంక్రాంతి, సమ్మర్ సీజన్లు కూడా ఇప్పటికే పలు క్రేజీ ప్రాజెక్టులతో బుక్ అయ్యాయి. దీంతో 'విశ్వంభర'కు సరైన విడుదల తేదీ ఎంపిక చేయడం మేకర్స్‌కు సవాలుగా మారిందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

---------------

# కల్కి సీక్వెల్‌లో ఆలియా భట్



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, డైరెక్టర్ నాగ్ అశ్విన్ కాంబినేషన్‌లో వచ్చిన సైన్స్ ఫిక్షన్ వండర్ 'కల్కి 2898 ఏడి' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ప్రభంజనం సృష్టించిందో అందరికీ తెలిసిందే. పురాణాల నేపథ్యంతో తెరకెక్కిన ఈ విజువల్ వండర్‌కు ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ వంటి దిగ్గజాల నటన ఈ సినిమాను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లింది. ప్రస్తుతం ఈ భారీ బ్లాక్‌బస్టర్ సీక్వెల్ 'కల్కి-2' కూడా ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. ఈ క్రమంలోనే 'కల్కి' ఫ్రాంచైజీ నుంచి ఒక ఆసక్తికరమైన అప్‌డేట్ సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఈ సీక్వెల్‌లో బాలీవుడ్ స్టార్ బ్యూటీ ఆలియా భట్ ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు సినీ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. గతంలో మొదటి భాగంలో నటించిన దీపికా పదుకొనె కొన్ని కారణాల వల్ల ఈ ప్రాజెక్ట్ నుండి తప్పుకున్న సంగతి తెలిసిందే. అయితే, ఆలియా భట్ దీపికా పోషించిన 'సుమతి' పాత్రను చేయడం లేదని తెలుస్తుంది. ఈ సినిమాలో వచ్చే ఒక పవర్‌ఫుల్ స్పెషల్ రోల్‌లో ఆమె కనిపించనున్నట్లు సమాచారం. మరింత షాకింగ్ విషయమేమిటంటే.. ఆలియా భట్ ఇప్పటికే తన పాత్రకు సంబంధించిన కొంతమేర షూటింగ్‌ను కూడా సైలెంట్‌గా పూర్తి చేసిందని టాక్. 'ఆర్ఆర్ఆర్' చిత్రంతో ఇప్పటికే తెలుగు ప్రేక్షకులకు బాగా దగ్గరైన ఆలియా.. ఇప్పుడు ఈ క్రేజీ సైన్స్ ఫిక్షన్ సీక్వెల్‌లో భాగం కావడం సినిమాపై అంచనాలను మరింత పెంచేస్తోంది. ఈ అలియా ఎంట్రీపై త్వరలోనే వైజయంతీ మూవీస్ టీమ్ నుండి అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

------

# 19న రానున్న మా ఇంటి బంగారం




'మా ఇంటి బంగారం' చిత్రంతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతోంది నటి సమంత. ఆమె ప్రధాన పాత్రధారిగా నటించిన ఈ సినిమాని నందినీ రెడ్డి తెరకెక్కించిన సంగతి తెలిసిందే. రాజ్ నిడిమోరు, సమంత, హిమాంక్ దువ్వూరు నిర్మించారు. దిగంత్, గుల్షన్ దేవయ్య, గౌతమి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 19న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం రాత్రి హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుకని నిర్వహించారు. దర్శకులు దేవా కట్టా, డీకే, రాహుల్ రవీంద్రన్, నిర్మాతలు డి.సురేశ్‌బాబు, వై రవిశంకర్, స్వప్న దత్ అతిథులుగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నటి సమంత మాట్లాడుతూ.. 'ఈ సినిమాతో కచ్చితంగా ఒకొక్కర్ని ప్రేమతో కొడతా. దీన్ని మేమంతా చాలా ప్రేమతో చేశాం. ఇప్పటి వరకు నటిగా నా కెరీర్ చాలా సాఫీగా సాగిపోయింది. కానీ, నటిగా, నిర్మాతగా ఉండటంలో ఉన్న కష్టమేంటన్నది నాలుగైదు రోజులుగా అర్థమవుతోంది. సమష్టి కృషి వల్లే ఈ చిత్రం సాధ్యమైంది. ఈ సినిమాలో నేను చాలా సహజంగా నటించానంటే దానికి ప్రధాన కారణం దీంట్లో ఉన్న సంభాషణలే. ఇందులో నేను చీరలో ఫైట్లు చేశాను. చాలా కష్టంగా అనిపించింది. దీంట్లో యాక్షన్ సన్నివేశాలన్నీ అలరిస్తాయి. ఈ సినిమాలో ప్రతిఒక్కరూ అద్భుతంగా నటించారు' అన్నారు.

'నా జీవితంలో ఈ సినిమాకి పడినంత కష్టం ఏ చిత్రానికి పడలేదు. సమష్టి కృషితో దీన్ని ఆరు నెలల్లో పూర్తి చేయగలిగాం. సమంత, రాజ్ నాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నానని నమ్ముతున్నా. ఈ నెల 19న మీకు నచ్చిన సామ్‌ని పది రెట్లు గొప్పగా తెరపై చూస్తారు' అన్నారు దర్శకురాలు నందినీ రెడ్డి. ఈ కార్యక్రమంలో చిన్మయి, దిగంత్, ఆనంద్, హిమాంక్, శ్రీలక్ష్మి, గవిరెడ్డి, పానీ వర్మ తదితరులు పాల్గొన్నారు.

---------------

## 'బిచ్చగాడు' కంటే 'వంద దేవుళ్ళు' పెద్ద హిట్ కావాలి: నిహారిక కొణిదెల



""బిచ్చగాడు' చిత్రం సాధించిన విజయం కంటే 'వంద దేవుళ్ళు' ఇంకా పెద్ద విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అంటూ నటి, నిర్మాత నిహారిక కొణిదెల ఆకాంక్షించారు. విజయ్ ఆంటోని హీరోగా నటించిన 'వంద దేవుళ్ళు' చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్ సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నిహారిక, సినిమాపై తన అభిప్రాయాన్ని పంచుకున్నారు.ఈ సందర్భంగా నిహారిక మాట్లాడుతూ.. "ఈ చిత్రాన్ని నేను ఇప్పటికే చూశాను. అమ్మలోనూ ఒక అమ్మాయి ఉంటుందనే పాయింట్‌ను దర్శకుడు శశి అద్భుతంగా చూపించారు. విజయ్ ఆంటోని గారు మంచి నటుడే కాకుండా గొప్ప వ్యక్తి. ఆయనతో మాట్లాడాక గౌరవం మరింత పెరిగింది. అమ్మను ప్రేమించే ప్రతిఒక్కరూ ఈ సినిమాను తప్పక చూడాలి" అని ప్రశంసించారు.హీరో విజయ్ ఆంటోని మాట్లాడుతూ.. "దర్శకుడు శశి ఈ కథ చెప్పినప్పుడు కన్నీళ్లు ఆపుకోలేకపోయాను. ఈ చిత్రంతో ఆయన నాకు మరో కొత్త జీవితాన్ని ఇచ్చారు," అని అన్నారు. దర్శకుడు శశి స్పందిస్తూ, ""బిచ్చగాడు' చిత్రానికి ఇది పూర్తి భిన్నంగా ఉంటుంది. అమ్మను దేవతలా చూస్తే అది 'బిచ్చగాడు' అయితే, అమ్మను ఒక సాధారణ మనిషిలా చూస్తే 'వంద దేవుళ్ళు'" అని వివరించారు.ఫాతిమా విజయ్ ఆంటోని సమర్పణలో, సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్‌పై రామంజనేయులు జవ్వాజీ నిర్మించిన ఈ చిత్రంలో స్వాసిక, అజయ్ ధీషన్, లిజోమోల్ జోస్ ముఖ్య పాత్రలు పోషించారు. ఈ చిత్రం జూన్ 19న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# వారణాసి బిజీలో మహేశ్‌బాబు

### సందీప్ వంగాతో మూవీపై అప్పడే క్లారిటీ



సూపర్ స్టార్ మహేశ్ బాబు, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో సినిమా రాబోతోందంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ప్రచారం జోరుగా సాగుతున్న సంగతి తెలిసిందే. ప్రముఖ నిర్మాణ సంస్థ ఏషియన్ సినిమాస్ బ్యానర్‌పై ఈ క్రేజీ ప్రాజెక్ట్ సెట్స్ పైకి వెళ్లనుందని ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ నడుస్తోంది. మహేశ్ బాబు ప్రస్తుతం రాజమౌళితో చేస్తున్న 'వారణాసి', సందీప్ వంగా కమిట్ అయిన 'స్పిరిట్', 'యానిమల్ పార్క్' ప్రాజెక్టులు పూర్తయిన తర్వాత ఈ కాంబో సెట్ అయ్యే అవకాశం ఉందని అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు. నిజానికి వీరిద్దరి కలయికలో సినిమా రావడం ఇదే మొదటి ఆలోచన కాదు. గతంలో ఏషియన్ సినిమాస్ నిర్మాణంలోనే మహేశ్, సందీప్ వంగా కలిసి 'డెవిల్' అనే సినిమా చేయాల్సి ఉంది. ఆ సమయంలో ఇద్దరికీ ఈ నిర్మాణ సంస్థ అడ్వాన్స్‌లు కూడా ఇచ్చినట్లు సమాచారం. కానీ కొన్ని అనివార్య కారణాల వల్ల ఆ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చలేదు. అప్పటి నుంచి ఈ ఇద్దరి కాంబినేషన్ కోసం టాలీవుడ్ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే ప్రస్తుతానికి ఈ సినిమాకు సంబంధించి ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. మహేశ్ 'వారణాసి' చిత్రం ముగిసిన తర్వాతే ఈ ప్రాజెక్ట్‌పై ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉంది. మరి నిజంగానే ఈ కాంబో సెట్ అవుతుందో లేదో చూడాలి.

# గూటుపల్లి భూముల సమస్య పరిష్కారానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు

## రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి వివరించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




**నంద్యాల బ్యూరో, జూన్ 16( రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్రంలో రెవెన్యూ సంబంధిత అంశాల పరిష్కారం, ప్రస్తుత సీజనల్ పరిస్థితుల నిర్వహణ, వ్యవసాయం మరియు అనుబంధ శాఖల సంసిద్ధతతో పాటు నీట్ పరీక్షల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లను సూచించారు. మంగళవారం అమరావతి సచివాలయం నుండి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీఎస్‌సీఎల్‌ఏ, వ్యవసాయ మరియు అనుబంధ శాఖల ఉన్నతాధికారులు, కళాశాల విద్యాశాఖ డైరెక్టర్ సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డీఆర్ఓ రాము నాయక్‌తో పాటు వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం గూటుపల్లి గ్రామానికి సంబంధించిన భూముల సమస్యను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. గూటుపల్లి గ్రామంలోని భూములన్నీ వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో 'వక్ఫ్ బోర్డు భూములు' మరియు 'ఎండోమెంట్ భూములు'గా నమోదై ఉండటంతో గ్రామ ప్రజలు వివిధ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. గ్రామం మొత్తం ఈ విధంగా నమోదుకావడం వల్ల భూ లావాదేవీలు, హక్కుల నిర్ధారణ తదితర అంశాల్లో సమస్యలు తలెత్తుతున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా సంబంధిత రికార్డులను పరిశీలించి, అవసరమైన సవరణలు చేపట్టేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి వివరించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, గూటుపల్లి గ్రామ భూముల అంశాన్ని సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకునే దిశగా ముందుకు సాగుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. అంతకుముందు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ మాట్లాడుతూ రెవెన్యూ, వ్యవసాయ రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రెవెన్యూ అంశాల పురోగతి, భూ సంబంధిత సమస్యల పరిష్కారం, ప్రజలకు మెరుగైన సేవలందించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యవసాయం, ఉద్యానవనం, పశు సంవర్ధక, మత్స్యశాఖల సంసిద్ధతను పరిశీలించి అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే నీట్ పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా పరీక్షా కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు, తాగునీరు, విద్యుత్ తదితర సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# కర్నూలులో యోగాంధ్రకు భారీ ఏర్పాట్లు

## 5.50 లక్షల మందితో యోగా దినోత్సవం నిర్వహణ లక్ష్యం

**11,500 మంది మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ పర్యాటక, ఆధ్యాత్మిక క్షేత్రాల్లో విస్తృత యోగా కార్యక్రమాలు: సెట్కూరు సీఈవో వేణుగోపాల్**







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 16)** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కర్నూలు జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు సెట్కూరు సీఈవో డాక్టర్ వేణుగోపాల్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా 5.50 లక్షల మందితో యోగా కార్యక్రమాలు నిర్వహించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు.

కర్నూలు నగర శివారులోని జగన్నాథగట్టు శ్రీ రూపాల సంగమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక యోగాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు.

జిల్లాలో ఇప్పటికే 5.50 లక్షల మంది యోగా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు నమోదు చేసుకున్నారని వెల్లడించారు. కార్యక్రమ విజయవంతం కోసం 11,500 మంది మాస్టర్ ట్రైనర్లకు ప్రత్యేక శిక్షణ అందించామని, వారు గ్రామాల నుంచి పట్టణాల వరకు ప్రజలకు యోగా శిక్షణ అందిస్తున్నారని చెప్పారు.

పర్యాటక యోగా కార్యక్రమాల్లో భాగంగా కర్నూలు రాక్ గార్డెన్, కొండారెడ్డి బురుజు వంటి ప్రాంతాల్లో సుమారు 800 మందితో యోగా కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. అలాగే దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఊరుకుంద, మంత్రాలయం, పెరవల్లి, కల్వబుగ్గ, జగన్నాథగట్టు వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ప్రత్యేక యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు.

ఈ నెల 18న ఎస్‌సీపీ గ్రౌండ్‌లో వెయ్యి మంది పారిశుధ్య కార్మికులతో ప్రత్యేక యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు.

యోగాపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు గ్రామ, వార్డు, మండల, జిల్లా స్థాయిల్లో పోటీలు నిర్వహించామని, జిల్లా స్థాయి విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర స్థాయిలో కూడా జిల్లా ప్రతినిధులు విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఆధ్యాత్మిక, ప్రశాంత వాతావరణంలో జగన్నాథగట్టులో యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ వేణుగోపాల్ కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్ స్టాప్ తో ఇబ్బందులు

## మున్సిపాలిటీ కి వెళ్లే వాహనాలకు అగచాట్లు

## మున్సిపాలిటీ కార్యాలయం ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ప్రయాణికులకు తిప్పలు

**నంద్యాల, జూన్ 16, (రిపబ్లిక్ న్యూస్):** ఆర్టీసి బస్సులు బస్టాండ్‌కు వెళ్లే మార్గం మధ్యలో మున్సిపాలిటీ కార్యాలయం ఉంది. రెడ్ సిగ్నల్ పడితే అక్కడ నుండి కుడివైపు పద్మావతి నగర్ కు వెళ్లడానికి గ్రీన్ సిగ్నల్ పడేవరకు వాహనాలు అక్కడే నిలిచి ఉంటాయి. అదే మున్సిపాలిటీ కార్యాలయంలో ఎదురుగా ఆర్టీసీ బస్సు వస్తే ప్రయాణికులను దించడానికి 2 నుండి 5 నిమిషాల వ్యవధి వరకు బస్సు అక్కడే నిలిచి ఉంటుంది. దీంతో బస్టాండ్ దారి వైపు వెళ్ళే వాహనాలు బస్సు వెనకాలే నిలిచిపోయి నిమిషాల పాటు ట్రాఫిక్ జామ్ అవుతుందని వాహన చోదకులు అంటున్నారు. అలాగే మున్సిపాలిటీ కార్యాలయంలో లోపలికి వెళ్లే అధికారులకు, సిబ్బంది, ప్రజలకు రోడ్డు దాటి వెళ్ళాడనికి కూడా చాలా ఇబ్బంది ఉంటుందని వారు పేర్కొన్నారు. ఆర్టీసీ బస్టాండ్ వెళ్లే బస్సులు మున్సిపాలిటీ కార్యాలయం రావడానికి ముందుగానీ, కార్యాలయం దాటిన 10, 20 మీటర్ల తరువాత గాని ప్రయాణికులను బస్సు నుండి దించడానికి నిలిపితే ట్రాఫిక్ అంతరాయం తగ్గి మున్సిపాలిటీ కార్యాలయంలోకి వెళ్లే వారికి, బస్టాండ్ దారి వైపు వెళ్లే వాహనచోదకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండవచ్చని ప్రజలు ఆశిస్తున్నారు. సంబంధిత ఆర్టీసీ అధికారులు, ట్రాఫిక్ అధికారులు స్పందించి ఈ సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు, మున్సిపాలిటీ కార్యాలయంలోకి వారు కోరుకుంటున్నారు.



# హై డెన్సిటీ ప్లాంటేషన్‌తో పచ్చదనానికి ప్రాధాన్యం ఇవ్వాలి

## ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలను మోడల్ గ్రీన్ క్యాంపస్‌లుగా తీర్చిదిద్దాలి

### జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి





**నంద్యాల బ్యూరో, జూన్ 16 (రిపబ్లిక్ న్యూస్):** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో హై డెన్సిటీ ప్లాంటేషన్‌ను విస్తృతంగా చేపట్టి పచ్చదనం పెంపొందించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో హై డెన్సిటీ ప్లాంటేషన్ కార్యక్రమాల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ సూర్యనారాయణ, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చింతామణి, డీఈఓ జనార్ధన్ రెడ్డి, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ప్రతినిధులు శర్వానన్ సుబ్రమణ్యం, జయసూర్య, ఆశ్రిత, అంకిత కుమారి, రాజశేఖర్, శరత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలు మరియు వసతి గృహాల ప్రాంగణాల్లో హై డెన్సిటీ ప్లాంటేషన్ ద్వారా పర్యావరణహిత వాతావరణాన్ని సృష్టించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో ఒక పాఠశాలను ఎంపిక చేసి సోక్ పిట్స్, వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలు, వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు, సోలార్ సదుపాయాలు తదితర అంశాలను సమగ్రంగా ఏర్పాటు చేసి దానిని ఆదర్శ గ్రీన్ మోడల్ పాఠశాలగా అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా రాతినేలలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో కూడా హై డెన్సిటీ ప్లాంటేషన్ విజయవంతంగా అమలు చేయడానికి అనువైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని, అందుకు అవసరమైన సాంకేతిక సూచనలు అందించాలని హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ప్రతినిధులను కోరారు. హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ప్రతినిధి శర్వానన్ సుబ్రమణ్యం మాట్లాడుతూ, వర్షాకాలంలో లభించే నీటిని సమర్థవంతంగా నిల్వ చేసుకోవడం అత్యంత అవసరమన్నారు. నీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుద్ధరణ, వర్షపు నీటి నిర్వహణ కార్యక్రమాలను విస్తృత స్థాయిలో అమలు చేయడం ద్వారా జిల్లాలో పచ్చదనం గణనీయంగా పెరిగే అవకాశముందని పేర్కొన్నారు.

# జూన్ 19 వ తేదీ న నంద్యాల జిల్లా స్థాయి చెస్ పోటీలు

## . శ్రీ రామకృష్ణ డిగ్రీ కాలేజ్ స్వామి వివేకానంద ఆడిటోరియంలో

## .రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్ల ఎంపిక

**నంద్యాల జూన్ 16 (రిపబ్లిక్ న్యూస్) :** ఆంధ్ర చెస్ అసోసియేషన్ నిర్వహించబోయే రాష్ట్రస్థాయి చెస్ పోటీలలో పాల్గొనే జిల్లా జట్ల ఎంపిక కోసం నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 19 వ తేదీ , శుక్రవారం ఉదయం 9 గంటల నుండి శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల స్వామి వివేకానంద ఆడిటోరియం లో నంద్యాల జిల్లా స్థాయి అమెచ్యూర్ చెస్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని నంద్యాల జిల్లా చెస్ అధ్యక్షులు, ఆంధ్ర చెస్ అసోసియేషన్ వైస్ చైర్మన్ డాక్టర్. జి. రవికృష్ణ, కార్యదర్శి రామసుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జిల్లా చెస్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రవి కృష్ణ ,రామ సుబ్బారెడ్డి.

ఈనెల 18 వ తేదీ సాయంత్రం 6 గంటల లోపు ఏపీ చెస్ వెబ్సైట్లో ఎంట్రీలు నమోదు చేసుకోవాలని నంద్యాల జిల్లా ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరగబోవు రాష్ట్రస్థాయి చదరంగా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు ఎంట్రీలు నమోదు చేసుకోవడానికి,ఇతర వివరాలకు నెంబర్ 9010451585 సంప్రదించగలరు

# స్వచ్ఛాంధ్ర లక్ష్యాల సాధనకు వేగం పెంచండి

## : జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి

### గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్య కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించాలి

### చెత్త కుప్పల తొలగింపు, వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి




**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 16)** జిల్లాలోని అన్ని గ్రామాలు, పట్టణాల్లో స్వచ్ఛతా కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర కార్యక్రమాల అమలుపై మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె పలు కీలక సూచనలు చేశారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం ద్వారా పారిశుధ్య పనులు నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని, ఈ వారం పబ్లిక్ టాయిలెట్లు, చెత్త కుప్పల తొలగింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. వ్యర్థాలు ఉత్పత్తి చేసే సంస్థలు తమ వద్దే వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలను ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. గ్రామాల్లో స్వచ్ఛ పథం కార్యక్రమం కింద స్వచ్ఛ రథాల ద్వారా చెత్త సేకరణ, తడిపొడి వ్యర్థాల వేరు సేకరణ, రోడ్ల పరిశుభ్రత, రీసైక్లింగ్ చర్యలపై వివరాలు తెలుసుకున్నారు. వీధులు, ప్రధాన రహదారుల పక్కన పేరుకుపోయిన చెత్తను తొలగించి పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని, మురుగునీటి కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని ఆదేశించారు.

వ్యర్థాల విభజనపై ప్రజల్లో అవగాహన పెంచి, అన్ని గ్రామాలు, మున్సిపాలిటీలు పారిశుధ్య నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిచి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ పేర్కొన్నారు. తద్వారా స్వచ్ఛ భారత్ మిషన్‌లో జిల్లాకు మెరుగైన ర్యాంకులు సాధించవచ్చన్నారు. సమావేశంలో కర్నూలు మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, అడిషనల్ కమిషనర్ కృష్ణ, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ రఘు, జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మిగనూరు, ఆదోని, గూడూరు మున్సిపల్ కమిషనర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు.



printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com